

ముక్కంటి క్షేత్రంలో యోగా





యోగాంధ్రలో భాగంగా బుధవారం శ్రీకాళహస్తిలోని రాజగోపురం వద్ద యోగాసనాలు వేశారు. ఎమ్మెల్యే సుధీర్, కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ.. యోగాంధ్రలో భాగంగా జిల్లాలో 9 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. యోగా.. మన శరీరానికి మేలు చేయడంతో పాటు ఏకాగ్రతను పెంచడం, మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగిస్తుందన్నారు. జీవితంలో మార్పు.. ఆరోగ్యం కోసం రోజూ యోగాకు అర గంట కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, జిల్లా అధికారి జనార్దనరెడ్డి, ముక్కంటి ఆలయ ఈవో బాపిరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, ఇతర అధికారులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

అక్షరాలు దిద్దిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శాస్త్రోక్తంగా అక్షరాభ్యాసం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం అక్షరాభ్యాసం కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయంలోని మేధో గురుదక్షిణామూర్తి సన్నిధిలో కలశ ప్రతిష్ఠ చేసి వేదపండితులు కార్యక్రమాన్ని నిర్వహించారు. తల్లిదండ్రులు పెద్దసంఖ్యలో తమ పిల్లలను ఆలయానికి తీసుకువచ్చి అక్షరాలు దిద్దించారు. ఎమ్మెల్యే సుధీర్ చిన్నారులకు పలక, బలపాలు అందజేసి వారి చేత అక్షరాలు దిద్దించారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, టీడీపీ నాయకులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకన్నా తక్కువకు కొంటే చర్యలు తీసుకుంటాం.

ఇదీ కలెక్టర్ వెంకటేశ్వర్ చేస్తున్న హెచ్చరికలు. అయినా, మామిడి రైతులకు వ్యాపారుల నుంచి మద్దతు రావడం లేదు.

- పాకాల, ఆంధ్రజ్యోతి

మామిడి రైతుకు మద్దతేదీ?

- తోతాపురి కొనింది రూ.3 వేలకే.. సాయంత్రం మరింత తగ్గింపు
- రోడ్డు పక్కన పారబోసిన రైతులు

మామిడికి మద్దతు ధరపై ప్రభుత్వ ప్రకటనలు, అధికారుల ఆదేశాలను గుజ్జు పరిశ్రమలు, ర్యాంపు యజమానులు, వ్యాపారులు పట్టించుకోవడం లేదు. వీరంతా సిండికేటుగా మారి బుధవారం ర్యాంపుల వద్ద కొనుగోళ్లను ఆపేశారు. దీంతో రైతులు పడిగాపులు గాస్తున్నారు. తోతాపురి టన్ను మద్దతు ధర రూ.8వేలు కాగా.. కనీసం రూ. 6వేలకైనా కొనాలని రైతులు ప్రాధేయపడుతున్నా వ్యాపారులు బేఖాతరు చేస్తున్నారు. చివరకు బుధవారం రూ.3వేలకు ధర పడిపోయింది. చీకటి పడ్డాక కొందరు రూ.1500కే కొనుగోలు చేశారు. మామిడి కోత కూలీ, రవాణాకుగాను టన్నుకు రూ.2500 ఖర్చవుతోందని రైతులు అంటున్నారు. చివరకు ఈ కూలి ఖర్చులూ రాక చేతినుంచి పడుతోందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. టన్ను రూ.2వేలకు కూడా కొనుగోలు చేయకపోవడంతో కొందరు కడుపుమండి ట్రాక్టర్లలో తెచ్చిన మామిడి కాయలను రోడ్డుపక్కన పడేసి వెళ్లిపోతున్నారు. ఇక, మరోవైపు గుజ్జు పరిశ్రమలకు ట్రాక్టర్లలో తీసుకెళ్తే అన్‌లోడింగ్‌కు రోజుల తరబడి వేచిచూడాల్సి వస్తోంది. దీంతో ట్రాక్టర్లు దొరకడంకూడా కష్టమవుతోంది. దామలచెరువు పరిసరాల్లోని ర్యాంపుల యజమానులు ఒక్కటై ఇబ్బందులు పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, జగన్మోహన్, మురళీమోహన్, కలెక్టర్ వెంకటేశ్వర్, ఉద్యాన శాఖ అధికారులు, మ్యాంగోనగర్‌కు వచ్చి వ్యాపారులతో, గుజ్జు పరిశ్రమల యజమానులు, ర్యాంప్ నిర్వాహకులతో చర్చించినా ఫలితం కనిపించలేదు. మామిడి తోటల్లో తోతాపురి కాయలన్నీ పక్వానికి వచ్చి రాలిపోతున్నాయని, త్వరతగతిన కొనుగోళ్లు చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకొని తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కాగా, ఎస్పీ హర్షవర్ధనరాజు బుధవారం దామలచెరువులోని మ్యాంగోనగర్‌కు వచ్చి వ్యాపారులు, సప్లయర్లతో మాట్లాడారు. మద్దతు ధరకు కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి దశరథరామిరెడ్డి, మండల ఉద్యాన అధికారి శైలజ బుధవారం మ్యాంగోనగర్‌లో పర్యటించారు. గుజ్జుపరిశ్రమల యజమానులు, ర్యాంప్‌లవద్ద సప్లయర్లు, మండీ వ్యాపారులు తోతాపురి మామిడికాయలు కొనుగోలు చేసి రైతులకు సహకరించాలని కోరారు. ర్యాంప్‌ల వద్ద టోకెన్లు ఇచ్చి రైతులు ఇబ్బందులు పడకుండా మద్దతు ధరకు కొనాలని లేదంటే చర్యలు తీసుకుంటామన్నారు.

‘మద్దతు’ లేకుంటే కఠిన చర్యలు: కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 18(ఆంధ్రజ్యోతి): తోతాపురి మామిడిపై మద్దతు ధరకన్నా తక్కువ చెల్లించేవారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేశ్వర్ హెచ్చరించారు. కలెక్టరేట్ నుంచి బుధవారం గుజ్జు పరిశ్రమ యాజమాన్యం, అధికారులతో ఆయన వర్చువల్‌గా సమీక్షించారు. ‘దామలచెరువులోని ట్రేడర్లు రైతులను ఇబ్బందికి గురి చేస్తున్నారని మా దృష్టికి వచ్చింది. మద్దతు ధరకంటే తక్కువ ఇస్తే చర్యలు తీసుకుంటాం. గుజ్జు పరిశ్రమలకు మామిడికాయలను తెచ్చే రైతులకు కనీస సౌకర్యాలు కల్పించాలి. జిల్లాలో మామిడి పంట ఉత్పత్తికన్నా ఎక్కువగా ఉన్న కారణంగా ప్యాకింగ్ మెటీరియల్‌ను సమకూర్చుకుని ప్రాసెసింగ్ యూనిట్ల కెపాసిటీని పెంచుకోవాలి. రైతులకు రావాల్సిన డబ్బును త్వరలో అందించాలి. ధరల విషయంలో ప్రభుత్వ ఉత్తర్వులు అమలయ్యేలా చూడాలి. మండలాల్లో తహసీల్దార్లు, ఉద్యాన అధికారులు మామిడి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి’ అని సూచించారు.



రోడ్డు పక్కన రైతులు పడేసిన తోతాపురి కాయలు

బారులు తీరిన ట్రాక్టర్లు

ఎర్రావారిపాలెం,జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఎర్రావారిపాలెంలోని జ్యూస్ ఫ్యాక్టరీ వద్ద బుధవారం మామిడి కాయలతో ట్రాక్టర్లు బారులు తీరా యి. గతేడాది పల్ప్ ఇప్పటికీ అమ్ముడుపోలేదంటూ ఈసారి పెద్దగా కొనుగోలు చేయకపోవడంతో రైతులు డీలా పడుతున్నారు. ప్రభుత్వ ఒత్తిడితో పంటలో 10 శాతం కన్నా తక్కువే ఫ్యాక్టరీలు కొనుగోలు చేస్తున్నాయి. ప్రోత్సాహకం ప్రకటించినా క్షేత్ర స్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



35 గంటల వెయిటింగ్

తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి: ఫ్యాక్టరీలకు ట్రాక్టర్లలో మామిడి కాయలు తీసుకెళ్లే గంటల కొద్దీ పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఆ వివరాలను చూస్తే.. నవ క్వాలిటీ ఫుడ్స్(ఎర్రావారిపాళెం)లో గరిష్ఠంగా 35గంటలు వేచి ఉండాల్సి వస్తోంది. రాసా ఫుడ్స్ (బీఎన్‌కండ్రిగ) గంట.. లియాన్ ఫుడ్స్(పుత్తూరు) 12గంటలు.. టాసా ఫుడ్స్ (నారాయణవనం) 24గంటలు.. శ్రీవర్ష ఫుడ్స్ (రేణిగుంట) 12గంటలు.. శ్రీదేవరాజుఆగ్రో ఫుడ్స్(కేవీబీపురం) 12గంటలు.. క్యాప్రికాన్(సత్యవేడు) 5గంటలు,, సుప్రీం క్వాలిటీ ఫుడ్స్ (పాకాల) 20 గంటలు వాహనాలు వేచి ఉండే పరిస్థితి ఉందని జిల్లా ఉద్యానశాఖాధికారి దశరథరామిరెడ్డి తెలిపారు. టోకెన్ సిస్టమ్ పాటిస్తే ఈ పరిస్థితి తప్పుతుందన్నారు.

- తమిళనాడులోని దోపిడీ కేసులో..

ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ అరెస్ట్



అరుణ్‌కుమార్

తిరుమల/చెన్నై, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో విధులు నిర్వహిస్తున్న ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ అరుణ్ కుమార్‌ను తమిళనాడు పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. తిరుపత్తూరు జిల్లా వాణియంబాడిలోని తోళ్లపరిశ్రమ యజమాని ఇంతియాస్ అహ్మద్ ఇంట్లో శక్తివేల్ పనిచేస్తున్నాడు. మూడు రోజుల కిందట దుండగులు ఆయన భార్య నబితా గుల్నంను కట్టేసి దోపిడీకి పాల్పడ్డారు. ఈ కేసులో పోలీసులు శక్తివేల్‌ను అనుమానించారు. ఇతడికి పరిచయమున్న కొల్లకట్టై ప్రాంతవాసి ఇళవరసన్, తిరుపతికి చెందిన శాంతకుమారి దోపిడీకి పాల్పడగా.. తిరుమలలో పనిచేసే ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ అరుణ్ కుమార్ ప్లాన్ ఇచ్చినట్లు దర్యాప్తులో గుర్తించారు. తిరుపతి పోలీసుల సహకారంతో అరుణ్‌కుమార్‌ను వాణియంబాడికి తీసుకెళ్లారు. కడపజిల్లాకు చెందిన అరుణ్‌కుమార్ రెండేళ్లుగా అలిపిరి చెక్‌పాయింట్, తిరుమలలోని పలు ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల తిరుమలలో బ్యాగేజీ స్కానింగ్ సెంటర్‌కు మారాడు.

‘చాళుక్య’ సేల్‌పై కమిటీ

- ఎమ్మెల్యే కమిటీ ప్రతిపాదనకు కౌన్సిల్ ఓకే
- వైసీపీ, కూటమి కార్పొరేటర్ల మధ్య వాడి వేడి చర్చ





మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు - సభ్యుల మధ్య వాదోపవాదాలు

తిరుపతి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరపాలక సంస్థకు చెందిన చాళుక్య హోటల్ స్థల విక్రయంపై కమిటీ వేయాలని కౌన్సిల్ నిర్ణయించింది. ఎస్వీయూ సెనేట్ హాల్‌లో మేయర్ డాక్టర్ శిరీష అధ్యక్షతన బుధవారం కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. అజెండాలోని 84 అంశాలపై చర్చించి అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. నిధులకోసం ప్రత్యామ్నాయ మార్గాల వైపు కార్పొరేషన్ అన్వేషించాలని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం కోరారు. సిటీ ఆపరేషన్ సెంటర్ నిర్మాణం త్వరగా పూర్తి చేసేందుకు అందరి సహకారంతో ముందుకు వెళతామని కమిషనర్ మౌర్య అన్నారు. సదరు స్థలాన్ని టీటీడీకి అప్పగించి సీవోసీ నిర్మాణం పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ ఎస్కే బాబు సూచించారు. తూకివాకం వద్దగల కార్పొరేషన్ స్థలాన్ని విక్రయించే ఆలోచన చేయాలని మరో కార్పొరేటర్ నరసింహాచారి సూచించారు. చాళుక్య స్థలం విక్రయంపై వాడి, వేడిగా చర్చ సాగింది. కౌన్సిల్ ఎక్స్‌అఫిషియో సభ్యుడు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు జోక్యం చేసుకుని కమిటీ ఏర్పాటుకు ప్రతిపాదించారు. నిధులు లేకుండా నిలిచిపోయిన మున్సిపల్ పరిపాలన భవనాన్ని పూర్తి చేసేందుకు నిరుపయోగంగా ఉన్న స్థలాన్ని విక్రయించడమో, పీపీపీ ద్వారా కేటాయించడమో చేయాలని ప్రభుత్వం భావించిందన్నారు. దీనిపై కొందరు కుట్రపూరితంగా ప్రభుత్వంపై అసత్య ప్రచారానికి పూనుకున్నారని చెప్పారు. స్థల విక్రయానికి సంబంధించి రెండు వారాల్లో ఒక కమిటీ ఏర్పాటుచేసి, తగిన నిర్ణయం తీసుకోవాలని ఎమ్మెల్యే ప్రతిపాదించగా కూటమి పార్టీకి చెందిన కార్పొరేటర్లు ఆమోదం తెలిపారు.

అందుకే నేను వ్యతిరేకించలేదు



‘అజెండాలో ఉన్న చాళుక్య హోటల్ విక్రయించే అంశం ముందుగానే నా దృష్టికి వచ్చింది. ఇది ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని తెలిసింది. అందుకే నేను వ్యతిరేకించలేదు’ అని మేయర్ శిరీష చెప్పారు. వ్యక్తిగతంగా స్థల విక్రయానికి తాను వ్యతిరేకినని చెప్పారు. డిప్యూటీ మేయర్లకు కారు అలవెన్సు అంశంపై వైసీపీ కార్పొరేటర్లు గణేష్, ఆరణి సంధ్య అభ్యంతరం చెబితే ఇలాంటి విషయాలపై చర్చపెట్టి ప్రజలకు ఎలాంటి సందేశం ఇస్తామని, గతంలో ఎలా ఉందో అలాగే కమిషనర్ నిర్ణయం తీసుకుంటారని మేయర్ హుందాగా వ్యవహరించారు.

ఇలాగే వదిలేస్తే అదికూడా మిగలదు

‘కార్పొరేషన్‌కు తొలుత అధికారికంగా 92 సెంట్లు ఉండేది. ఈస్టు పోలీస్ స్టేషన్‌కు 15 సెంట్లు ఇచ్చారు. మిగిలింది 77 సెంట్లు ఉండాలి. కానీ పోలీస్ స్టేషన్ అధీనంలో మరో 15 సెంట్లు, ఫ్రీలెఫ్ట్ కోసం కొంత స్థలం, మరికొంత ఆక్రమణలు పోను, ఇప్పుడు సర్వే చేస్తే 39 సెంట్లు మాత్రమే ఉంది. ఇలాగే వదిలేస్తే 20 సెంట్లు కూడా మిగలదు. కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించినప్పుడు కార్పొరేషన్ భవనం 30 శాతమే నిర్మాణం జరిగింది. నేను వచ్చాక కాంట్రాక్టర్‌ను ఒత్తిడి చేసి 70 శాతం వరకు పూర్తి చేశాం. బకాయిలు ఇస్తేనే 6 నెలల్లో నిర్మాణం పూర్తిచేసుకోవచ్చు. అందుకే 30 ఏళ్లుగా వృథాగా ఉన్న స్థలాన్ని పీపీపీ విధానంలో ఇవ్వాలా? విక్రయించాలా? అని కౌన్సిల్ అనుమతి కోసం తీసుకొచ్చాం’ అని కమిషనరు మౌర్య అన్నారు.



దుష్ప్రచారం చేసినవారిపై కేసులు

అజెండాలో ప్రస్తావించని అంశాలను వైసీపీ నేతలు కాకిలెక్కలు వేసి అంకణం రూ.60వేలకు అమ్మేస్తున్నట్లు ప్రచారం చేయడం మంచిదికాదని డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ మండిపడ్డారు. ఇలా అసత్య ప్రచారం చేస్తున్నవారిపై కేసులు నమోదు చేయాలని డిమాండు చేశారు. కపిలతీర్థం సర్కిల్లో కారుచౌకగా కార్పొరేషన్ స్థలాన్ని కట్టబెట్టిన విషయం ప్రజలు ఇంకా మరిచిపోలేదన్నారు.

మరో టూరిజం భవనంగా మార్చేస్తారా?

రుయాస్పత్రి ఎదురుగా నిధుల కొరతతో నిలిచిపోయిన టూరిజం భవనంలాగే మున్సిపల్ కార్యాలయాన్ని కూడా మార్చేస్తారా అంటూ డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ ప్రశ్నించారు. దీన్ని పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అంకణం రూ.10లక్షలపైన వస్తే విక్రయించడం వల్ల ప్రజలకు అభ్యంతరం ఉండదన్నారు.

సమగ్ర వ్యవసాయ విధానంపై అవగాహన



వ్యవసాయ క్షేత్రంలో తమిళనాడు రైతులు

రామచంద్రాపురం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మిట్టూరు గ్రామంలోని రాస్ కృషి విజ్ఞాన్ కేంద్రం దత్త రైతు పురుషోత్తంనాయుడు వ్యవసాయ క్షేత్రాన్ని తమిళనాడు రైతులు బుధవారం సదర్శించారు. 16మంది రైతులకు సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ఎన్ శ్రీనివాసులు సమగ్ర వ్యవసాయ విధానంలో ఆహార, ఉద్యా, పశుపోషణ మొదలైన అంశాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ సాగుతోనే అధిక పంట దిగుబడిని సాధించవచ్చని ఆదర్శ రైతు పురుషోత్తమనాయుడు వివరించారు. కార్యక్రమలో కేసీకే సిబ్బంది ప్రియాంక, ఆత్మ సిబ్బంది, తమిళనాడు రైతులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి



ఎస్టీవో జ్ఞాన ప్రసూనకు వినతి పత్రం అందజేస్తున్న బీటీఏ నాయకులు

పాకాల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండు చేశారు. బీటీఏ మండల శాఖ అధ్యక్షుడు జ్యోతి ప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక సబ్ ట్రెజరీ అధికారిజ్ఞానప్రసూనకు బుధవారం వినతి పత్రం అందజేశారు. మెడికల్ రీ ఎంబర్స్‌మెంట్ బిల్లులు, సరెండర్‌లీవు బిల్లులు సకాలంలో చెల్లించాలని కోరారు. పదవీ విరమణ చెందిన వారి లైఫ్ సర్టిఫికెట్లు ఫారం-16 సమస్యలను పరిష్కరించాలని కోరారు. బీటీఏ నాయకులు జి.ఆంజినేయులు, ఆదికేశవులు. జయబాల, కృష్ణమూర్తి, బంగారు రాజు, గోపాలయ్య, సుబ్బయ్య, సుధాకర్, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు. ● స్థానిక సబ్‌ట్రెజరీ కార్యాలయం నుంచి బదిలీ అయిన ధనుంజయను రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం నాయకులు బుధవారం సన్మానించారు. ఆయన స్థానంలో యూడీసీగా వచ్చిన నాగజ్యోతికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం పాకాల యూనిట్ అధ్యక్షుడు పీఆర్. మునస్వామి, ప్రధాన కార్యదర్శి కుప్పుస్వామినాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయరామనాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు జి.ఆంజినేయులు, కెఎన్ తులసీరామన్, దొరస్వామినాయుడు,శంకర్ నాయుడు, దేశప్పనాయుడు, సుబ్రమణ్యం శెట్టి, ఎస్టీవో జ్ఞానప్రసూన తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు:ఎస్పీ



రికార్డు పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

చంద్రగిరి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు హెచ్చరించారు. బుధవారం చంద్రగిరి పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. నోటీసు బోర్డులోని 16 అంశాలను పరిశీలించి, పెండింగ్‌లో కేసులను క్లియర్ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. నోటీసు బోర్డులో కొత్త చట్టాలను రాసి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. నైట్ బీట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. నేరస్తులపై నిఘా ఉంచి ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. ఆయన వెంట డీఎస్పీ ప్రసాద్, సీఐ సాధిక్ ఆలీ, ఎస్ఐ అనిత, సిబ్బంది పాల్గొన్నారు.

పాకాల: స్థానిక పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఎస్పీ హర్షవర్ధన్ రాజు సందర్శించారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. పార్ట్ 4 విలేజి హిస్టరీ. రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారించాలన్నారు. నిరంతర గస్తీ ఉంచాలని సూచించారు. అనంతరం మండలంలోని దామలచెరువు మ్యాంగోనగర్‌లో పర్యటించారు.

మోదీ హయాంలో ప్రజా సంక్షేమ పథకాలు



సమావేశంలో మాట్లాడుతున్న మునిసుబ్రమణ్యం

చంద్రగిరి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వికసిత్ భారత్ సుపరిపాలనలో పేదలకు కు సంక్షేమం ఒనగూరిందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మునిసుబ్రమణ్యం అన్నారు. బుధవారం చంద్రగిరిలోని ఓప్రైవేటు హోటల్లో ఆ పార్టీ నాయకుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా మునిసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ 11 ఏళ్ళలో ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు గురించి వివరించారు. అయోధ్య రామమందిరం, 370 ఆర్టికల్, ఆపరేషన్ సిందూర్, ఇలా అనేక కార్యక్రమాలు విజయవంతంగా పూర్తి చేశారన్నారు. కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి పార్టీని బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటముని, జిల్లా మాజీ అధ్యక్షుడు సుబ్రమణ్యంయాదవ్, మునిగంగిరెడ్డి, ఏవీ ప్రసాద్, కాకిమాను మునిరాజు, లక్ష్మమ్మ, నవీన్‌కుమార్‌రెడ్డి, సంగీతం దొరస్వామి పాల్గొన్నారు.

ముగిసిన మిట్టమీద గంగమ్మ జాతర



చంద్రగిరి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మిట్టమీద గంగమ్మ జాతర ఉత్సవాలు మంగళవారం అర్ధరాత్రి విశ్వరూప దర్శనంతో ఘనంగా ముగిశాయి. అమ్మవారు పేరంటాళ్ళ వేషంలో భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం అర్ధరాత్రి విశ్వరూప ప్రతిమను తయారు చేసి, విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. గ్రామోత్సం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, ఉభయదారులు, చంద్రగిరి ప్రజలు పాల్గొన్నారు.

అవిలాలలో ఊపందుకున్న యూడీఎస్ పనులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్..!



తిరుపతి రూరల్, వే18(ఆంధ్ర జ్యోతి): అవిలాల గ్రామ పంచాయతీల్లో గంగమ్మ గుడి వీధిలో రూ.6లక్షల పంచాయతీ నిధులతో చేపట్టిన యూడీఎస్ పనులు పూర్తిచేశారు. ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన వార్తకు గ్రామ సర్పంచ్ చెందిలి వెంకటరమణ స్పందించారు. రెండ్రోజుల్లో పూర్తిచేసేలా పనులు వేగవంతం చేశారు. 180మీటర్ల పొడవుతో యూడీఎస్ నిర్మించామని వివరించారు.

బాలిక కిడ్నాప్

వాకాడు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేణుగోపాల పురం గ్రామానికి చెందిన బాలిక(17) మంగళవారం రాత్రి నుంచి కనిపించడం లేదని ఆమె తల్లి మహేంద్రమ్మ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పూడిరాయదొరువు పంచాయతీ చినతోట గ్రామానికి చెందిన మహేష్ కిడ్నాప్ చేసి ఎత్తుకెళ్లినట్లు అనుమానం వ్యక్తం చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హుస్సేన్‌బాషా తెలిపారు.

చంద్రగిరి

పంచాయతీ కార్యదర్శుల బాధ్యతల స్వీకరణ

భాకరాపేట, జూన్ 18(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలంలో పలువురు పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయ్యారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కార్యదర్శులు బాధ్యతలు చేపట్టారు. వీరిలో చిన్నగొట్టిగల్లు పంచాయతీ కార్యదర్శిగా వెంకటేశులు, తిప్పిరెడ్డిగారిపల్లె పంచాయతీ కార్యదర్శిగా జోష్నా దేవి, రంగన్నగారిగడ్డ పంచాయతీ కార్యదర్శిగా జమీర్, కోటబైలు కార్యదర్శులుగా సాయి, ఢిల్లీ ముఖర్జీలు బుధవారం బాధ్యతలు చేపట్టారు.

రామచంద్రాపురం: చంద్రగిరి ఐసీడీఎస్‌ప్రాజెక్టు రామచంద్రాపురం సెక్టార్ సూపర్‌వైజర్‌గా కె.మనీలా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వడమాలపేట మండలం నుంచి ఆమె రామచంద్రాపురం మండలానికి బదిలీపై వచ్చారు.

సచివాలయ సిబ్బంది పరస్పర ఫిర్యాదులపై కేసు నమోదు

చంద్రగిరి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మిట్టపాలెం సచివాలయ సిబ్బంది పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేసుకోన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. వెల్ఫర్ అసిస్టెంట్ గుణశేఖర్ అప్పుడప్పుడు పంచాయతీ కార్యదర్శి గోవర్ధన్ అనుమతితో బయటకు వెళ్ళేవారు. దీనిపై ఏఎన్ఎం అన్నపూర్ణ వారి గ్రూపులో ఒక పోస్టు పెట్టారు. తనకు బయటకు వెళ్ళడానికి అనుమతి ఇవ్వలేదని నిరసించారు. దీంతో గుణశేఖర్, అన్నపూర్ణల మధ్య వాగ్వాదం జరిగింది. వివాదానికి రాజకీయం కూడా తోడయ్యింది. ఈక్రమంలో అన్నపూర్ణ తనను గుణశేఖర్ లైంగికంగా వేధిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన పట్ల అన్నపూర్ణ అవమానకరంగా, హేళనగా, మానసికంగా వేధించేలా వ్యవహరిస్తోందని గుణశేఖర్ ఫిర్యాదు చేశారు. వైసీపీ నాయకుల ప్రోద్బలంతో తప్పుడు ఫిర్యాదు చేసిందని పేర్కొన్నారు.. ఇరువురిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హనుమంత వాహనంపై సుందరరాజస్వామి



తిరుచానూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారికి ఆలయానికి అనుబంధంగా ఉన్న సుందరరాజస్వామి వారి అవతార మహోత్సవాల్లో భాగంగా బుధవారం హనుమంత వాహనంపై ఊరేగారు. శ్రీకృష్ణస్వామివారి ముఖమండపంలో స్వామికి మధ్యాహ్నం అభిషేకం, సాయంత్రం ఊంజల్‌సేవ నిర్వహించారు. రాత్రి స్వామివారు హనుమంత వాహనంపె మాడవీధుల్లో విహరించి భక్తులకు అభయమిచ్చారు. గురువారం అవతారమహోత్సవాలు ముగియనున్నాయి. ఆలయ డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు చలపతి, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం ఎంఈవోపై చీటింగ్ కేసు

గుడిపాల, జూన్ 18(ఆంధ్రజ్యోతి):శ్రీరంగరాజపురం ఎంఈవో సబర్మతిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు గుడిపాల ఎస్ఐ రామ్మోహన్ బుధవారం తెలిపారు.గుడిపాల మండలం బుచ్చన్నకండ్రిగ గ్రామానికి చెందిన సబర్మతిపై అదే గ్రామానికి చెందిన ప్రియాంక ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రియాంకకు ప్రభుత్వ నర్సుగా ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పిన సబర్మతి రూ.5 లక్షలు ఖర్చవుతుందని చెప్పి ముందుగా రూ.2.50 లక్షలు చెల్లించాలని కోరినట్లు తెలిపారు. దీంతో ఫోన్ పే ద్వారా గత సంవత్సరం రూ.1.55 లక్షలు,నేరుగా రూ.50 వేలు అందించిన ప్రియాంక ఎంతకూ ఉద్యోగం తీసివ్వకపోవడంతో న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించిందన్నారు.దీంతో సబర్మతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సమగ్రశిక్షలో బదిలీలకు షెడ్యూల్ విడుదల

చిత్తూరు సెంట్రల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రశిక్షలో బదిలీలకు షెడ్యూల్ విడుదలైంది. సైట్ ఇంజనీర్లు, కేజీబీవీ టీచింగ్, నాన్‌టీచింగ్, మండల విద్యాశాఖ కార్యాలయంలోని సీఆర్‌ఎంటీలు, మండల స్థాయి అకౌంట్స్, ఎంఐఎస్ కోఆర్డినేటర్, డేటాఎంట్రీ ఆపరేటర్లు, మెసెంజర్లు, సబార్డినేట్స్ రిక్వెస్టు, మ్యూచువల్ బదిలీలు జరగనున్నాయి. ఈ నెల 19వ తేదీ గురువారం నుంచి 21వరకు దరఖాస్తుల స్వీకరణ, 23న సీనియారిటీ జాబితా, 24న ప్రచురణ, 27 వరకు అభ్యంతరాల స్వీకరణ, పరిశీలన, 28న తుదిజాబితా ప్రచురణ, 30 నుంచి జూలై 2వ తేదీ వరకు కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు జరుగనున్నాయి. ఈ మేరకు సమగ్రశిక్ష అధికారులు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

20, 21 తేదీల డీఎస్సీ పరీక్షల మార్పు

చిత్తూరు సెంట్రల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న క్రమంలో ఈనెల 20, 21 తేదీల్లో జరగాల్సిన మెగా డీఎస్సీ పరీక్షల తేదీలను మార్పు చేసినట్లు డీఈవో వరలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెండు రోజుల్లో పరీక్షలు రాయాల్సిన అభ్యర్థులకు జూలై 1, 2 తేదీల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు హాల్‌టికెట్లు ఈనెల 25వ తేదీ ఏపీడీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. యోగా దినోత్సవం ద్వారా పరీక్షలకు హాజరయ్యే వారు ఇబ్బందులు పడకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు డీఈవో ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ముందుకెళ్లని మురుగుతో ముప్పుతిప్పలు



అవిలాల సుబ్బయ్యకాలనీ-పేరూరు తారకరామనగర్-తుమ్మలగుంటల్లో అధ్వానంగా మురుగునీటి వ్యవస్థ

తిరుపతి రూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రూరల్ మండల పరిధిలోని పలు పంచాయతీల్లో ఓపెన్ డ్రైనేజీ కాలువల సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. స్థానికులు, అటువైపు ప్రయాణించేవారు దుర్వాసన భరించలేకపోతున్నారు. కాలువకు ఆనుకుని ఉంటున్న వారి పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. కాలువల్లో తరచూ చెత్త, చెదారాలతో పేరుకుపోతున్నాయి. కొన్ని పంచాయతీల్లో కాలువలు ఆక్రమణలకు గురికావడంతో మురుగు నీరుముందుకు కదలడంలేదు. ఓపెన్ డ్రైనేజీ కాలువలు ఉన్న చోట్ల యాడీఎస్ ఏర్పాటు చేయాల్సిన అవసరముంది. అవిలాల పంచాయతీల్లో అంబేడ్కర్ కాలనీ, సుబ్బయ్యకాలనీల మీదుగా పెద్ద కాలువ గుండా మురుగునీరు ప్రవహిస్తుంది. తుమ్మలగుంట పంచాయతీల్లో జాతీయరహదానికి ఆనుకుని ఉప్పరపల్లెమీదుగా మురుగు గాంధీపురం శ్మశానవాటికలో కలుస్తుంది. సమీపంలోని అపార్ట్‌మెంట్ల నుంచి వచ్చే మురుగు నీరు ఈకాలువమీదుగా ఇదే శ్మశానంలోకి చేరుతుంది. వర్షం కురిస్తే ఈమురుగునీరు తుమ్మలగుంట రోడ్డుపైకి చేరుతుంది. కాగా తుమ్మలగుంటలో యాడీఎస్ ఏర్పాటుకు రూ.9.60కోట్లు మంజూరు చేసినా పనుల్లో జాప్యం జరుగుతోంది.

పేరూరు పంచాయతీల్లో స్టాఫ్ క్వార్టర్స్ ఎదురుగా తారకరామనగర్, జనార్ధన్ నగర్, ఎల్ఎస్‌నగర్, డెయిరీఫాం మీదుగా వెళ్లే ఓపెన్ డ్రైన్ ఎంఆర్‌పల్లె వద్ద మజ్జిగకాలువలో కలుస్తుంది. లింగేశ్వరనగర్ పంచాయతీ మీదుగా ఓటేరు వరకు మజ్జిక కాలువ మీదుగా మురుగునీరు పారుతుంది. ఓటేరు ముఖద్వారంలో కల్వర్టు కింద పెద్దమురుగు నీరు కాలువ పారుతోంది. అంబేడ్కర్ విగ్రహం వద్ద, గంగిరెడ్డులకాలనీ, క్షత్రియనగర్, శ్రీవారికాలనీ మీదుగా ప్రవహించే ఓపెన్‌డ్రైనేజీనీరు మామిడికాయలమండి వెనుక ఉన్న ఖాళీస్థలంలోకి చేరుతుంది. వేదాంతపురంపంచాయతీల్లో సీపీఆర్ విల్లాస్,ఎస్ఆర్‌లేఅవుట్ మీదుగా మురుగునీరు కాలువ ప్రవహిస్తుంది.

మా ఊరి పాఠశాలను విలీనం చేయొద్దు

విద్యార్థులు, తల్లిదండ్రుల నిరసన



పీవీపురం పాఠశాల వద్ద తల్లిదండ్రులు, విద్యార్థుల నిరసన

రామచంద్రాపురం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): పీవీపురం, పరమాల గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలను ఆదర్శ పాఠశాలల పేరుతో విలీనం చేయవద్దని పీవీపురంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. పీవీపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను బలిజపల్లె మోడల్ స్కూల్‌లో విలీనం చేశారు. దీంతో రామిరెడివ్వపల్లి, ఎస్టీకాలనీ, గంగమాంబపురం, పీవీపురం గ్రామాల నుంచి విద్యార్థులు రాష్ట్ర రహదారిపై నడిచి వెళ్లాల్సి ఉంటుంది. పీవీపురంలో మోడల్ స్కూల్ ఏర్పాటు చేస్తే అన్ని గ్రామాలకు అనుకూలంగా ఉంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు విద్యాశాఖ అధికారులను కోరుతున్నారు. గ్రామస్థులు ఎంపీడీవో ఇందిరమ్మ, ఎంఈవో మార్కెండేయనాయుడులకు వినతిపత్రం అందజేశారు.

భాకరాపేట: స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో తమ గ్రామానికి చెందిన విద్యార్థులను విలీనం చేయొద్దని వడ్డిపల్లె గ్రామస్తులు బుధవారం ఎంపీడీవో గిడ్డయ్య, ఎంఈవో సత్యనారాయణలనకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వడ్డిపల్లె నుంచి భాకరాపేటకు రెండు కిలోమీటర్ల దూరం ఉందని, 3, 4, 5 తరగతుల పిల్లలను పంపలేమన్నారు. కూలి పనులకు ఉదయం వెళితే సాయంత్రం తిరిగి వస్తామని, తమ గ్రామంలోనే 3, 4 తరగతులు కొనసాగించాలని కోరారు

27 నుంచి ధర్మరాజస్వామి ఉత్సవాలు



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ఈవో తదితరులు

శ్రీకాళహస్తి, జూన్18(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా చెన్నై రోడ్డులో కొలువైన ద్రౌపది సమేత ధర్మరాజస్వామి ఆలయ ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే సుధీర్ తెలిపారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం ఉత్సవాల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27వ తేదీ నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు.

ఉత్సవాల వివరాలు...

ధర్మరాజస్వామి ఉత్సవాల్లో ఈనెల 27న పాండవ, కౌరవ జన నం కథ, ధ్వజా రోహణం, 28న పాండవ విద్యాభ్యాసం, 29న హిండింబాసుర, బకా సుర వధ, 30న మత్స్యయంత్రచ్ఛేదనం, జూలై 1న ద్రౌపది కల్యాణం, 2న రాజ సూయ యాగం, 3న ద్రౌపది వస్త్రాపహరణం, 4న అర్జున తపస్సు, అలుగు నిలుపుట, 5న ఉత్తర గోగ్రహణం, అర్జునుడు ఆవులను మలవేయుట, 6న దుర్యోధన, దుశ్శాసన వధ, అమ్మవారి కురులు ముడివేయుట, పూర్ణాహుతి, అగ్నిగుండ ప్రవేశం, 7న వసంతోత్సవం, ధ్వజావరోహణం, 8న కుంభం, 9న పార్వేట ఉత్సవం జరుగనున్నాయి.

కోటపల్లిలో పంటలపై ఏనుగుల గుంపు

కల్లూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. మండలంలోని పాళెం పంచాయతీ కోటపల్లి వద్ద మామిడిచెట్లను ఏనుగుల గుంపు ధ్వంసం చేయడంతో అపారనష్టం వాటిల్లింది. ముందుగా తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని చింతలవంక నుంచి మంగళవారం రాత్రి బయలుదేరిన ఏనుగుల గుంపు కోటపల్లి సమీపానికి చేరుకున్నాయి. రైతు వెంకటమునికి చెందిన 20 మామిడిచెట్లను ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయి. దామోదర్‌నాయుడుకు చెందిన మామిడి కొమ్మలను విరిచేపి పశుగ్రాసాన్ని తొక్కేశాయి. వీరభద్రనాయుడుకు చెందిన 5 మామిడిచెట్లు, పనస చెట్టును విరిచేసిన ఏనుగులు బోరు మోటారు, పైపులను ధ్వంసం చేశాయి. అడవిలోకి వెళుతూమామిడిచెట్లను ధ్వంసం చేసుకుంటూ చేరుకున్నాయి. బుధవారం పగలంతా అడవిలోని చింతలవంక వద్ద తిష్ట వేసినట్లు అటవీశాఖ సిబ్బంది తెలిపారు.

హ్యావెల్స్ పరిశ్రమలో రక్తదానం



సత్యవేడు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని ఏసీ తయారీ పరిశ్రమ హ్యావెల్స్ లాయిడ్‌లో ప్రపంచ రక్తదాత దినోత్సవం సందర్భంగా బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. నెల్లూరుకు చెందిన రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో పరిశ్రమలోని 128 మంది ఉద్యోగులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేసినట్టు ప్లాంట్ హెడ్ గిరీష్‌చంద్ర తెలిపారు. ఇందులో 44 మంది తొలిసారిగా రక్తదానం చేశారన్నారు. కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు లారెన్స్ ఆరోగ్యరాజ్, అశ్వీందర్ రైనా, ప్రవీణ్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

కుప్పం ఎంఈవో సస్పెన్షన్

కుప్పం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండల విద్యాశాఖాధికారి షేక్ మహబూబ్ బాషాను విధులనుంచి సస్పెండ్ చేస్తూ పాఠశాల విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ శామ్యూల్ మంగళవారం సాయంత్రం ఉత్తర్వులు విడుదల చేశారు. కుప్పం పల్లార్లపల్లె వద్ద గల హాకింగ్స్ స్కూల్ విషయంలో తాను ఇచ్చిన ఆదేశాలకు విరుద్ధంగా వ్యవహరించినందుకు ఈ క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. హాకింగ్స్ స్కూల్‌లో తమ పిల్లలను కొనసాగించమని తల్లిదండ్రులను ఎంఈవో మహబూబ్ బాషా తప్పుదారి పట్టించారన్నారు. ఈ పాఠశాలకు గుర్తింపు లేదని చెప్పారు. ఆ పాఠశాల సీబీఎస్ఈ గుర్తింపును పొందుతోందని, రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపును ఉపసంహరించుకోవడంపై ఎటువంటి ప్రభావం లేదని, వారి పిల్లలను అదే పాఠశాలలో కొనసాగించమని మహబూబ్ బాషా తల్లిదండ్రుల సమావేశంలో చెప్పినట్లు వీడియో క్లిప్పింగుల ఆధారంగా నిర్ధారించుకున్నట్లు ఆర్జేడీ పేర్కొన్నారు. ఇది తల్లిదండ్రులను తప్పుదారి పట్టించిందన్నారు. శాఖ పట్ల సమగ్రత లేకపోవడం, ఉన్నతాధికారుల పట్ల అవిధేయత, విధి నిర్వహణలో నిర్లక్ష్యం, మండల విద్యాశాఖాధికారి హోదాలో అధికారాలను దుర్వినియోగం చేయడం అనే కారణాలతో ఎంఈవో షేక్ మహబూబ్ బాషాను తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. క్రమశిక్షణా చర్యలు ముగిసే వరకూ ఆయన సస్పెన్షన్‌లో కొనసాగుతారని తెలిపారు.

నేడు పలు రైళ్ల రద్దు

తడ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): చెన్నై - గూడూరు మధ్య నేడు (గురువారం) పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు చెన్నై డివిజన్ సదరన్ రైల్వే అధికారులు ప్రకటించారు. చెన్నై - గూడూరు మార్గంలోని కవర్‌పేట, గుమ్మిడిపూడి స్టేషన్ల మధ్యలో ఇంజనీరింగ్, సిగ్నల్ వ్యవస్థ మార్పు పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 3.00 గంటల వరకు 6 గంటల పాటు పనులను చేపట్టనున్నారు. ఆ సమయంలో ఈ మార్గంలో నడిచే పలు రైళ్లను అధికారులు రద్దు చేశారు.

రద్దయిన రైళ్ల వివరాలు...

- సూళ్లూరుపేట నుంచి నెల్లూరుకు మధ్యాహ్నం 3.50కు బయలుదేరి వెళ్లే మెమూ రైలు నెంబరు 66037
- నెల్లూరు నుంచి సూళ్లూరుపేటకు సాయంత్రం 6.40 నిమిషాలకు బయలుదేరి వచ్చే మెమూ రైలు నెంబరు 66038
- చెన్నై మోర్ మార్కెట్ కాంప్లెక్స్ నుంచి సూళ్లూరుపేటకు ఉదయం 8.35, 10.15 గంటలకు, మధ్యాహ్నం 12.10, 1.05 గంటలకు వచ్చే ఈఎంయూ రైళ్లు.
- సూళ్లూరుపేట నుంచి చెన్నైకు మోర్‌మార్కెట్ కాంప్లెక్స్‌కు ఉదయం 11.45, మధ్యాహ్నం 1.15, 3.10, రాత్రి 9 గంటలకు బయలుదేరి వెళ్లే ఈఎంయూ లోకల్ రైళ్లు.
- చెన్నై నుంచి గుమ్మిడిపూడికి ఉదయం 8.05, 9.00, 9.30, 9.40, 10.30, 11.35, మధ్యాహ్నం 12.40 వచ్చే ఈఎంయూ రైళ్లు.
- గుమ్మిడిపూడి నుంచి చెన్నైకు ఉదయం 9.55, 10.55, 11.25, మధ్యాహ్నం 12.00, 1.00, 2.30, 3.15, బయలుదేరి వెళ్లే ఈఎంయూ లోకల్ రైళ్లు రద్దు అయ్యాయి.

వైభవంగా కరికాలమ్మ జాతర



పుత్తూరు టౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని తడుకులో కరికాలమ్మ జాతరను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం గ్రామంలోని నడివీధిలో పుట్టమట్టితో అమ్మవారి శిరస్సును ప్రతిష్ఠించి, ప్రాణ ప్రతిష్ఠ చేశారు. అనంతరం శాస్త్రోక్తంగా పూజా కైంకర్యాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద పెద్ద ఎత్తున అంబళ్లు పోశారు. అన్నదానం చేశారు. అనంతరం అమ్మవారి ఎదుట కుంభం పోశారు. సాయంత్రం అమ్మవారి చెంపకొట్టి చెరువులో నిమజ్జనం చేయడంతో జాతర ముగిసింది.

శిరీషకు రూ.5 లక్షల చెక్కు పంపిణీ

● 50 సెంట్ల భూమి ఇస్తామని హామీ



శిరీష పిల్లలకు చెక్కు అందజేస్తున్న పీఎస్ఎం, కడా పీడీ వికాస్ మర్మత్ తదితరులు

కుప్పం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘం నారాయణపురంలో అప్పు వసూలు కోసం చెట్టుకు కట్టేసి వేధించిన సంఘటనలో బాధితురాలు శిరీషకు బుధవారం కడా ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్. మునిరత్నం, కడా సలహా మండలి సభ్యుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు రూ.5 లక్షల విలువ చేసే చెక్కును ప్రభుత్వం తరపున పంపిణీ చేశారు. నారాయణపురం గ్రామానికి చెందిన తిమ్మరాయప్ప అప్పులు చేసి పారిపోగా, ఆయన భార్య శిరీష బెంగళూరులో దొరికిన పని చేసుకుంటూ ముగ్గురు బిడ్డలను పోషించుకుంటోంది. ఈ క్రమంలో సోమవారం కుమారుడు అభి టీసీకోసం నారాయణపురం వచ్చిన శిరీషను, ఆమెకు రూ.80 వేలు అప్పు ఇచ్చిన అదే గ్రామానికి చెందిన మునికన్నప్ప, ఆయన భార్య వెంకటమ్మ, కొడుకు రాజా, కోడలు జగదీశ్వరి చెట్టుకు కట్టేసి అమానుషంగా వేధించిన విషయం తెలిసిందే. ఈ దారుణంపై తీవ్రంగా స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఎస్పీ మణికంఠను ఆదేశించారు. దీంతో నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి కోర్టు ముందు హాజరుపరచగా, జడ్జి వారికి 14 రోజులు రిమాండ్ విధించారు. అదే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు శిరీషతో, మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా మాట్లాడి ఆమె కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. రూ.5 లక్షలు తక్షణ ఆర్థిక సాయంగా ప్రకటించడమే కాక, పిల్లల చదువుల బాధ్యతను ప్రభుత్వమే చూసుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో శిరీషను, ఆమె ముగ్గురు పిల్లలు మధు, దీక్షిత, అభిలను బుధవారం కడా కార్యాలయానికి పిలిపించారు. శిరీషకు జరిగిన అన్యాయంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. టీడీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రభుత్వం తరపున రూ.5 లక్షల విలువ గల చెక్కును పంపిణీ చేశారు. ఇదిగాక ముఖ్యమంత్రి సూచనల మేరకు 50 సెంట్ల భూమిని శిరీష కుటుంబానికి ప్రభుత్వం తరపున త్వరలోనే ఇస్తామని చెప్పారు. ప్రభుత్వం తరపున ముగ్గురు పిల్లల విద్యకు అవసరమైన అన్నిరకాల సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. మళ్లీ ఇటువంటి అమానుష, దారుణ సంఘటనలు జరుగకుండా శిరీషకు, ఆమె కుటుంబానికి పూర్తి పోలీసు రక్షణ కల్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కుప్పం మున్సిపల్, మండల అధ్యక్షులు రాజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, టీడీపీ నియోజక వర్గ విస్తరణ కమిటీ సభ్యుడు కన్నన్ పాల్గొన్నారు.

పట్టించుకోండి సారూ..!

వీధిలో మురుగు ప్రవాహం



నగర పరిధిలోని పూలవానిగుంట ప్రధాన వీధి మురుగునీటి మడుగును తలపిస్తోంది. కాలనీల్లోని సైడు కాలువల్లో చెత్తచెదారం చేరిపోవడంతో మురుగు నీరు రోడ్లపైకి చేరుతోంది. వాహన చోదకులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. పైగా దుర్వాసన వెదజల్లుతుండడంతో ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి. అధికారులు స్పందించి దీనిపై దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు. - తిరుపతి (వైద్యం)

బీఎండీ పరీక్షలు చేయించుకోవాలి



రోగులకు బీఎండీ పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సుకుమార్

తిరుపతి(వైద్యం), జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత జీవన విధానంలో ప్రతి ఒక్కరూ ఎముకలు, కీళ్ల వ్యాధులతో బాధపడుతున్నారని, 45 ఏళ్లు దాటిన వారు బీఎండీ(ఎముకల సాంద్రత) పరీక్షలు చేయించుకోవాలని ప్రముఖ ఎముకలు, కీళ్లు, నరముల వైద్య నిపుణులు డాక్టర్ సుకుమార్ అన్నారు. సాయిసుధా ఆస్పత్రిలో బుధవారం ఉచిత బీఎండీ పరీక్షలు నిర్వహించారు. మందులు అందజేశారు. ఎముకల్లో కాల్షియం తగ్గడం వల్ల కీళ్ల, నరముల సమస్యలు తలెత్తుతాయని, పోషకాహారం తీసుకోవడం ద్వారా దాన్ని నివారించవచ్చునని తెలిపారు. మూడు నెలలకొకసారి బీఎండీ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుధారాణి, డాక్టర్ సుబ్బానాయుడు, డాక్టర్ వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో జోరుగా అడ్మిషన్లు



అడ్మిషన్స్ చేసుకుంటున్న అధ్యాపకులు

తిరుపతి అర్బన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మంగళం పరిధిలోని ఐదు పంచాయతీల పాఠశాలల్లో అడ్మిషన్స్ జోరుగా నమోదవుతున్నాయి. 2025-26 విద్యా సంవత్సరానికి ఈ నెల 12న పాఠశాలలు పునఃప్రారంభమైన విషయం తెలిసిందే. మంగళం క్వార్టర్స్‌లోని ట్రెండ్స్ ఉన్నత పాఠశాల, కళాశాల, మోడల్ ప్రాథమిక పాఠశాల, మంగళం, శెట్టిపల్లి, తిరుమలనగర్ ప్రాథమిక పాఠశాలు, రణధీరపురంలో మోడల్ ప్రాథమిక పాఠశాలలో తొలిరోజు నుంచే అడ్మిషన్లు బాగా జరుగుతున్నాయి. 1నుంచి 12వ తరగతి వరకు దాదాపు 250మంది విద్యార్థులు చేరారు. నూతన పుస్తకాలు, బ్యాగులు, యూనిఫాం, నోట్‌బుక్స్ వంటివి ముందుగానే అందజేస్తున్నారు.

సులభ పద్ధతిలో రుణాలు



మైక్రోలోన్స్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ప్రతినిధులు

తిరుపతి అర్బన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): చిన్న, మధ్య తరగతి వ్యాపారులకు, ఉద్యోగులకు సులభ పద్ధతిలో రుణాలు మంజూరు చేస్తామని సిటీ యూనియన్ బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయానంద్ ప్రకటించారు. బైరాగిపట్టెడ, హథీరాంజీకాలనీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో బుధవారం ఆయన మైక్రోలోన్స్ యూనిట్‌ను ప్రారంభించారు. సిటీ క్రెడిట్ సంస్థ సిటీ యూనియన్ బ్యాంక్ భాగస్వామ్యంతో మైక్రో రుణాలు రూ.10లక్షల నుంచి 50లక్షల వరకు అవకాశముందన్నారు.వ్యాపారాలను, ఉద్యోగ హోదాలను అనుసరించి, ఐటీ రిటర్న్ లేకున్నా అతితక్కువ వడ్డీరేటుతో రుణాలు మంజూరు చేస్తామని వివరించారు. ఆసక్తిగల వారు మరిన్ని వివరాల కోసం 9966700001ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సిటీ యూనియన్ బ్యాంక్ అధికారి షౌకత్‌అలీ, సిటీ క్రెడిట్ అధినేత కొండేటి రవికుమార్, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

విమానాశ్రయానికి వెంకన్న పేరు శుభప్రదం

తిరుపతి(జీవకోన), జూన్ 18(ఆంధ్రజ్యోతి): తిరుపతి విమానాశ్రయానికి శ్రీవెంకటేశ్వర అంతర్జాతీయ విమానాశ్రయం పేరును ప్రతిపాదిస్తూ టీటీడీ తీర్మానం చేయడం శుభప్రదమని బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. అలాగే తిరుమల ఆలయాన్ని నోఫ్లయింగ్ జోన్‌గా ప్రతిపాదిస్తూ గతంలో టీటీడీ బోర్డు కేంద్రానికి రాసిన లేఖ రాసిందని, దాన్ని అమలు చేసేలా చొరవ చూపాలని కోరారు. ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ప్రతిభావంతులకు ఉచిత విద్య

తిరుపతి(విద్య), జూన్ 18(ఆంధ్రజ్యోతి): ప్రతిభావంతులైన విద్యార్థులకు తమిళనాడు తిరునల్వేలిలోని పీఎస్ఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉచితంగా ఇంజినీరింగ్ చదివే అవకాశం కల్పిస్తున్నట్లు ఆ కళాశాల ప్రతినిధి మారియప్పన్ చెప్పారు. ఎమ్మార్‌పల్లెలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పీఎస్ఎన్ కళాశాల నిర్వహించే ఎంట్రన్స్ టెస్ట్‌లో ప్రతిభ చూపిన 50 మంది విద్యార్థులకు ఈ అవకాశాన్ని కల్పిస్తామన్నారు. తిరునల్వేలిలో 26 ఏళ్లుగా తమ కళాశాల నడుస్తోందని, ఇక్కడ చదివిన వారు ఉద్యోగాల కోసం ఇబ్బందిపడాల్సిన అవసరం లేదని తెలిపారు. అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ ద్వారా అత్యుత్తమ బోధన, వసతులు ఉన్నాయని వివరించారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఉచిత ప్రవేశాల కోసం కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌ను తిరుపతిలోనూ నిర్వహిస్తామని, ఆసక్తి ఉన్న అభ్యర్థులు 8341359208లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

తిరుపతిలో నెల్లూరు వాసి అదృశ్యం

తిరుపతి(నేరవిభాగం), జూన్ 18(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో నెల్లూరు వాసి అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు వివరాల మేరకు.. నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం చిన్నరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు కుటుంబ సమేతంగా ఈ నెల 14న తిరుమలకు వచ్చారు. దర్శనానంతరం మరుసటి రోజు తిరుపతికి చేరుకుని శ్రీనివాసంలో కాసేపు విశ్రాంతి తీసుకున్నారు. సాయంత్రం స్వగ్రామానికి వెళ్లడానికి సిద్ధమవుతుండగా వెంకటేశ్వర్లు కనపడలేదు. భార్య ఆదిలక్ష్మి బుధవారం ఈస్ట్ పోలీసుల ఫిర్యాదు చేసింది.

ప్రేమ విఫలమై యువతి ఆత్మహత్య

తిరుపతి(నేరవిభాగం), జూన్ 18(ఆంధ్రజ్యోతి): ప్రేమించిన వ్యక్తి వేరొకరిని పెళ్లి చేసుకున్నాడన్న బాధతో యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు వివరాల మేరకు.. సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం చింతలమాను గ్రామానికి చెందిన రత్నమ్మ పదేళ్లుగా తిరుపతిలోని మజ్జిగ కాలువ ప్రాంతంలో కాపురముంటున్నారు. ఈమెకు ఇద్దరు కుమార్తెలు. భర్త నాగరాజు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. రెండవ కుమార్తె చందన (21) తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్డులోని పరిణయ సిల్క్ హౌస్‌లో సేల్స్ గర్ల్‌గా పనిచేస్తోంది. బంధువుల అబ్బాయి లక్ష్మీనారాయణను ప్రేమించింది.ఆయనకు వేరొక యువతితో నిశ్చితార్థం జరిగినట్లు తెలుసుకుని మంగళవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతి చెందింది. పెద్ద కూతురు ఇంటికి వెళ్లి ఉన్న తల్లి రత్నమ్మ విషయం తెలుసుకుని వెంటనే తిరుపతికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు చందన మృతదేహాన్ని తిరుపతి రుయాకు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నీటిశుద్ధి కేంద్రం మూసివేత

తెలుగుగంగపై ఆధారపడుతున్న శెట్టిపల్లె ప్రజలు



శిథిలావస్థలో నీటిశుద్ధి కేంద్రం పరికరాలు



తిరుపతి అర్బన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): శెట్టిపల్లెలో నీటిశుద్ధి కేంద్రం మూన్నాళ్ల ముచ్చటగా మారింది. తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలిచిన భూమన కరుణాకరరెడ్డి అక్కడి ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని 2013 జూన్‌లో శుద్ధజల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో కొన్ని రోజులు సజావుగా సాగింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ శెట్టిపల్లె గ్రామాన్ని నగరపాలక సంస్థలో విలీనం చేసింది. ఆ తర్వాత ఈ కేంద్రం నిర్వహణ బాధ్యతను కాంట్రాక్టర్‌కు అప్పగించింది. నష్టం రావడంతో రెండో నెలకే ఆయన చేతులెత్తేశాడు. ఆ తర్వాత ఎవరూ ముందుకు రాకపోవడంతో ఆ కేంద్రం మూలనపడిపోయింది. నగరపాలక సంస్థ దృష్టి సారించకపోవడంతో పూర్తిగా మూతపడింది. అప్పుడూ ఎమ్మెల్యేగా ఉన్న కరుణాకరరెడ్డికి ఈ విషయం తెలిసినా పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి. కేంద్రంలోని యంత్రాలు, ట్యాంకులు, ఇతర వస్తువులు శిథిలమైపోయాయి. అక్కడి ప్రజలు తెలుగు గంగ నీటితోనే సరిపెట్టుకుంటున్నారు. కొందరు విధిలేని పరిస్థితిలో బయట కొనుగోలు చేస్తున్నారు. ప్రైవేటు కేంద్రాలకు ఆదాయం పెంచేందుకు ఈ కేంద్రం మూతపడేలా చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

భర్త ఆచూకీ తెలపండి

ఈస్ట్ పోలీసులకు ఒడిశా మహిళ వేడుకోలు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 18(ఆంధ్రజ్యోతి): కొన్ని రోజులుగా కనిపించకుండాపోయిన తన భర్త ఆచూకీ తెలపాలని ఒడిశాకు చెందిన లక్ష్మి బుధవారం తిరుపతి ఈస్ట్ పోలీసులను వేడుకుంది. ఆమె చెప్పిన వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా పాలూరు గ్రామానికి చెందిన పులకల లక్ష్మీనారాయణ జీవనోపాధి కోసం భార్యతో కలసి కొన్ని నెలల క్రితం తిరుపతికి వచ్చారు. సత్యవేడు మండలం చమర్తికండిగ వద్ద కల సెవన్ హిల్స్ క్వారీ యజమాని మునిరెడ్డి వద్ద పనికి చేరాడు. ఈ ఏడాది ఏప్రిల్ 28న అన్నమయ్య జిల్లా మదనపల్లె వద్ద లారీ రిపేరు కోసం వెళుతున్నానని చెప్పి వెళ్లాడు. అక్కడ పని ముగించుకుని తిరుపతికి వస్తున్నానని మే ఒకటో తేదీ భార్యకు ఫోన్ చేసి చెప్పాడు. పైగా తనతో పాటు ఉన్న సుఖార్సింగ్‌తో కలిసి తిరుమలకు వెళ్లాలని చెప్పి భార్య నుంచి ఫోన్ పే ద్వారా రూ.700వేయించుకున్నాడు. ఆ తర్వాత తన భర్త ఫోన్ పనిచేయలేదని, సుఖార్సింగ్‌కు చేయగా లక్ష్మీనారాయణ మద్యం తాగి తిరుపతి రైల్వేస్టేషన్ వద్ద పడుకుని ఉన్నాడని చెప్పాడని లక్ష్మీ ఫిర్యాదులో తెలిపింది. క్వారీ యజమాని మణిరెడ్డిని అడుగ్గా మే ఒకటో తేదీ నుంచి పనికి రావడంలేదని చెప్పడంతో తిరుపతి, చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా జాడ లభించలేదు. దీంతో బుధవారం ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నిబంధనలు అతిక్రమించిన భవనం కూల్చివేత



తిరుపతి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా నిబంధనలను అతిక్రమించి నిర్మిస్తున్న భవనాన్ని బుధవారం నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు పడగొట్టారు. నగరంలోని ఎర్రమిట్ట రాయల్ నగర్‌లో 30 అంకణాల స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనాన్ని కమిషనర్ ఎన్.మౌర్య ఆదేశాల మేరకు డీసీపీ ఖాన్ ఆధ్వర్యంలో ప్లానింగ్ అధికారులు, సిబ్బంది తొలగించారు. మూడు అంతస్తులకు అనుమతి ఉండగా అదనంగా రెండు అంతస్తులు నిర్మించడంతో వాటిని తొలగించటం ప్రారంభించారు. గురువారం సాయంత్రానికి తొలగిస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ మూర్తి, ప్లానింగ్ సెక్రటరీ పాల్గొన్నారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు



విద్యాసాగర్, అప్పలనాయుడు - నాగలక్ష్మీ చౌదరి - వాసుకీ

తిరుమల, జూన్18(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఎంపీ అప్పలనాయుడు, ఏపీ ఎన్జీవోల స్టేట్ ప్రెసిడెంట్ విద్యాసాగర్, కర్ణాటక రాష్ట్ర ఉమెన్ కమిషన్ చైర్‌పర్సన్ నాగలక్ష్మీచౌదరి, సినీనటి వాసుకీ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

యోగా దినోత్సవం విజయవంతం కావాలని ప్రార్థించా

విశాఖపట్నంలో ఈనెల 21న దాదాపు ఐదు లక్షల మందితో జరిగే యోగా ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రధాని పాల్గొంటారని ఎంపీ అప్పలనాయుడు తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం కావాలని శ్రీవారిని కోరుకున్నట్టు చెప్పారు. ఏపీ ఎన్జీవోల స్టేట్ ప్రెసిడెంట్ విద్యాసాగర్ మాట్లాడుతూ.. పన్నెండున్నర లక్షల ఉద్యోగఉపాధ్యాయ పెన్షనర్ల ప్రతినిధిగా ప్రతిష్టాతకమైన ఏపీ ఎన్జీవోల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో శ్రీవారి ఆశీస్సుల కోసం వచ్చామన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 25 మందికి జరిమానా

తిరుపతి(నేర విభాగం), జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో 25 మందికి జరిమానా విధిస్తూ తిరుపతి జిల్లా అదనపు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పారు. ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచారి కథనం మేరకు.. తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై ఇటీవల పోలీసులు నిఘా పెంచారు. తరచూ తనిఖీలు చేసి కేసులు నమోదు చేస్తున్నారు. ఇందులో భాగంగా 25 మంది మందుబాబులను న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. ఒక్కొక్కరికి రూ.పది వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

మోదీ పాలనపై కరపత్రాల పంపిణీ



కరపత్రాలను పంపిణీ చేస్తున్న బీజేపీ నేతలు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూన్ 18(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ 11ఏళ్ల పాలన, పథకాలకు సంబంధించిన కరపత్రాలను బుధవారం జీవకోనలో బీజేపీ నేతలు పంపిణీ చేశారు. పార్టీ ఉత్తర మండలాధ్యక్షుడు లోకప్రభాకర్ నాయుడు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో గుండాల గోపినాథ్‌రెడ్డి, మల్లారపు రవిప్రసాద్, పార్థసారథి, నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్యంరెడ్డి పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీఓ నాయకులకు స్వాగతం



నాయకులను సత్కరిస్తున్న తిరుపతి నేతలు

తిరుపతి(విద్య), జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ నూతన నాయకులకు తిరుపతిలో ఘన స్వాగతం లభించింది. అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డీవీ రమణ, కార్యవర్గ సభ్యులు శ్రీవారి దర్శనార్థం బుధవారం తిరుపతికి వచ్చారు. జిల్లా అధ్యక్షుడు రాఘవులు, కార్యదర్శి రఘు, సహాధ్యక్షులు వరప్రసాద్ నయనార్ వారికి స్వాగతం పలికి, దుశ్శాలువతో సత్కరించారు. ప్రభుత్వంతో చర్చించి దీర్ఘకాలంగా ఉన్న బకాయిలను చెల్లించేలా కృషి చేయాలని, కొత్త పీఆర్సీని వెంటనే అమలుపరిచేలా ప్రయత్నించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి వెంకటేశ్వర్లు, సహాధ్యక్షులు దస్తగిరి, తిరుపతి యూనిట్ కార్యదర్శి బాలాజీ, జిల్లా, తిరుపతి కార్యవర్గం పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించండి



సంతోషరావుతో చర్చిస్తున్న ఇంజనీరింగ్ అసోసియేషన్ నాయకులు

తిరుపతి (ఆటోనగర్), జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం ఇంజనీరింగ్ క్యాడర్‌లో ఉన్న ఖాళీలను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని ఏపీ ఎస్ఈబీ ఇంజనీరింగ్ అసోసియేషన్, ఏపీ ఎస్పీడీసీఎల్ నాయకులు సంస్థ సీఎండీ కె.సంతోషరావును కోరారు. బుధవారం సీఎండీ కార్యాలయంలో కలసి ఈ విషయంపై చర్చించారు. పెరుగుతున్న పని భారానికి అనుగుణంగా అదనపు పోస్టులు మంజూరు చేయాలని కోరారు. క్షేత్రస్థాయిలో ఇంజనీర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు వి.రమేష్ కుమార్, పుల్లా బాలాజీ, డి.భాస్కర్‌నాయుడు, కె.జయప్రకాష్, పి.రవికుమార్, కె.మునిప్రసాద్, స్వాతి, వెంకటలక్ష్మి, బాలాజీ, రమేష్ పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్‌తో విద్యుత్ బిల్లులు ఆదా చేసుకోండి



వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్న చంద్రశేఖర్‌రావు

తిరుపతి(ఆటోనగర్), జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్ యోజన పథకంతో విద్యుత్ బిల్లులు ఆదా చేసుకోవాలని తిరుపతి టౌన్ డివిజన్ ఈఈ విన్నకోటి చంద్రశేఖరరావు కోరారు. పాత తిరుచానూరు రోడ్డులోని విద్యుత్ ఈఈ కార్యాలయ ప్రాంగణంలో వినియోగదారులకు సోలార్ రూఫ్‌టాప్ పథకంపై అవగాహన కల్పించారు. సోలార్ ద్వారా వినియోగదారులు భవిష్యత్తులో విద్యుత్ బిల్లులు కట్టే అవసరం ఉండకపోవచ్చని చెప్పారు. కిలో వాట్‌కు కేంద్ర ప్రభుత్వం రూ.30వేలు రాయితీ ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వినియోగదారులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఈలు, ఏఈలు, జేఈలు పాల్గొన్నారు.

యోగా జీవితంలో భాగం కావాలి



మహిళలకు యోగా శిక్షణ ఇస్తున్న హైమావతి

తిరుపతి(ఆటోనగర్), జూన్ 18(ఆంధ్రజ్యోతి): యోగాను ప్రతి ఒక్కరూ నిత్యకృత్యం చేసుకోవాలని శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ హైమావతి అన్నారు. బుధవారం రాస్ సంజయ్‌గాంధీ క్లస్టర్‌లో మహిళలకు యోగాపై శిక్షణ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ మహిళలు యోగాను దినచర్యగా చేసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. ఉదయం, సాయంత్రం గంటపాటు యోగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇందిరా, ప్రీతి, కళ్యాణి, స్వాతి, నిర్మల, లలిత పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య



మృతి చెందిన నీలిమ

తిరుపతి(నేరవిభాగం), జూన్ 18(ఆంధ్రజ్యోతి): వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం అలిపిరి పరిధిలోని సత్యనారాయణపురంలో చోటుచేసుకుంది. ఎస్ఐ నాగార్జునరెడ్డి వివరాల మేరకు.. సత్యనారాయణపురానికి చెందిన నీలిమ(29) ఆరేళ్ల క్రితం అదే ప్రాంతానికి చెందిన బాబురెడ్డిని ప్రేమ వివాహం చేసుకుంది. మనస్పర్థల కారణంగా నాలుగేళ్లకే బాబురెడ్డి భార్యను వదిలేశాడు. అప్పటి నుంచి ఆమె తల్లిదండ్రులతో ఉంటోంది. మనస్తాపానికి గురైన ఆమె బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి మణి ఫిర్యాదు మేరకు అలిపిరి ఎస్ఐ కేసు నమోదు చేశారు.

సావనీర్ డిజైన్ పోటీలకు ఆహ్వానం

తిరుపతి(ఆటోనగర్), జూన్ 18(ఆంధ్రజ్యోతి): లేపాక్షి(ఏపీహెచ్‌డీసీ), ఆప్కో ఆధ్వర్యంలో సావనీర్ డిజైన్ పోటీలకు ఆహ్వానిస్తున్నట్లు లేపాక్షి ఎంపోరియం మేనేజరు రవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్లకు పైబడిన హస్త కళాకారులు అర్హులని పేర్కొన్నారు. కళాకారులు, నేత కార్మికులు, డిజైనర్స్, చేతిపనుల పట్ల మక్కువ కలిగిన సృజనాత్మక ఔత్సాహికులు పాల్గొనవచ్చని వివరించారు. ఆసక్తి ఉన్న వారు తాము రూపొందించిన డిజైన్లను జూలై 16వ తేదీలోపు లేపాక్షి, ఆప్కో షోరూమ్‌లలో అందించాలని తెలిపారు. ఈ పోటీల్లో ఎంపికైన డిజైన్లకు రూ.5లక్షల వరకు బహుమతులు ఉంటాయని వెల్లడించారు.

అలిపిరి చెక్‌పాయింట్ విస్తరణకు చర్యలు


అధికారులతో సమీక్షిస్తున్న ఈవో శ్యామలరావు

● సమీక్షలో టీటీడీ ఈవో శ్యామలరావు

తిరుమల, జూన్18(ఆంధ్రజ్యోతి): తిరుమల క్షేత్ర భద్రత, భక్తుల సౌకర్యార్థం దృష్ట్యా అలిపిరి చెక్‌పాయింట్‌ను ఆధునిక సౌకర్యాలతో మరింత విస్తరించేందుకు చర్యలు చేపట్టినట్టు టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో బుధవారం ఆయన అదనపు ఈవో వెంకయ్య చౌదరి, వివిధ విభాగాల అధికారులతో సమీక్షించారు. తొలుత అలిపిరి చెక్‌పాయింట్ వద్ద ఆధునిక సౌకర్యాలు, పటిష్ట భద్రత తదితర అంశాలపై రాక్షా సంస్థ (జీఎంఆర్ గ్రూప్) పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చింది. తనిఖీలు, లగేజీ స్కానింగ్‌కు సమయం, సమస్యలపై అధికారులతో చర్చించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా మరింత వేగంగా వాహనాలు, లగేజీ స్కానింగ్ చేసేందుకు చర్యలు చేపట్టాలని రాక్షా సంస్థ ప్రతినిధులకు ఈవో సూచించారు. చెక్‌పాయింట్ వద్ద తనిఖీ సమయాన్ని తగ్గించేందుకు మార్గాలను సూచించాలన్నారు. టీటీడీ విజిలెన్స్ విభాగం లగేజీ స్కానింగ్‌లో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న రెండు దశాబ్దాల్లో భక్తుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని భద్రతాంశాలపై ప్రతిపాదించాలని రాక్షా ప్రతినిధులను కోరారు. ఆధునిక స్కానర్ల ఏర్పాటు, స్కానర్ల సంఖ్య పెంపుపై దృష్టి సారించాలన్నారు. ఎయిర్‌పోర్టు తరహాలో లగేజీ కన్వేయర్ బెల్ట్‌ల పొడవును పెంచి సమయాన్ని నివారించే అంశం పరిశీలించాలన్నారు. మరింత మంది భద్రతా సిబ్బందిని నియమించి తనిఖీలను సులభతరం చేయాలని సూచించారు. రాక్షా సీఈవో అమిత్ దార్, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ, సీఈ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 6 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.



- సోమవారం హుండీ ఆదాయం: రూ.4.12 కోట్లు
- మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 81,037
- తలనీలాలు సమర్పించినవారు: 30,548

సాగులో యాంత్రీకరణకు ప్రోత్సాహం

● కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడి

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని ఆదుకుంటోందని, సాగులో యాంత్రీకరణను ప్రోత్సహిస్తూ యంత్ర పరికరాలు, డ్రోన్లను రాయితీతో అందిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం 1,678 మంది చిన్న, సన్నకారు రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాలకు సంబంధించి రాయితీ సొమ్ము రూ2,67,26,984 మెగా చెక్కును వ్యవసాయ అధికారి ప్రసాద్‌తో కలిసి పంపిణీ చేశారు. అనంతరం రైతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే రైతులకు సుమారు రూ.6కోట్ల విలువ గల వ్యవసాయ యంత్ర పరికరాలను అందించినట్లు తెలిపారు. అందులో రాయితీ కింద రూ.2,67,26,984 రైతులకు అందిస్తున్నామన్నారు. ఏ సీజన్‌లో ఎలాంటి పంటలు వేయాలనే విషయం తెలుసుకుని తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే పంటలను పండించాలన్నారు. రసాయనిక ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను పెంచాలని సూచించారు. రైతులు పంటల బీమా చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ప్రసాద్‌రావు, వ్యవసాయశాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.


రైతులకు మెగా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

అన్నదాతకు వెన్నుదన్ను

● ఖరీఫ్‌కు ముందే.. గత నెలలో రాయితీతో పరికరాల పంపిణీ


శ్రీకాళహస్తిలో గత నెలలో ట్రాక్టరుకు అమర్చే పరికరాలను రాయితీతో అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 18(ఆంధ్రజ్యోతి): మొత్తం వ్యవసాయ పరికరాలు 1678. వీటి విలువ మొత్తం రూ.5.96 కోట్లు. అందులో రాయితీ మొత్తం 2,67,26,984 రూపాయలు. ఇలా కూటమి ప్రభుత్వం ఈ ఏడాదిలో రైతులకు రాయితీతో యంత్రాలు అందించి వెన్నుదన్నుగా నిలిచింది. వ్యవసాయం పాతపద్ధతిలో చేస్తే లాభం లేదు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి చేస్తేనే రైతు లాభాలబాట పడతాడు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి పదేపదే చెబుతారు. ఆయన 2014-19లో కూడా ఈ దృష్టితోనే అవసరమైన పరికరాలను సబ్సిడీపై అందించారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీనిని తేలిగ్గా తీసుకుంది. గ్రూపులుగా ఏర్పడితేనే అందజేసేది. అదీ మొక్కుబడిగా ఇచ్చింది. గతేడాది కూటమి ప్రభుత్వం రావడంతో వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రైతులకు వ్యక్తిగతంగానూ యంత్ర పరికరాలను రాయితీపై అందిస్తోంది. జిల్లాకు కేటాయించిన 1,678 పరికరాలను ఖరీఫ్‌కు ముందే గతనెల మొదటి వారంలోనే పంపిణీ చేసి అన్నదాతకు ఆసరాగా నిలిచింది. ఐదెకరాలలోపు ఉండి దరఖాస్తు చేసుకున్న సన్న, చిన్నకారు, మహిళా రైతులు 1,678 పరికరాలకు దరఖాస్తు చేసుకోగా.. అందరికీ పంపిణీ చేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. రాయితీపై 15 డ్రోన్లు అందించామన్నారు.

పంపిణీ చేసిన పరికరాలివీ

ట్రాక్టరుకు అనుసంధానించే యంత్రాలు	899
పవర్ స్ప్రేయర్లు	626
బ్యాటరీ స్ప్రేయర్లు	66
రొటావేటర్లు	57
పవర్ వీడర్లు	16
బుష్ కట్టర్లు	10
పవర్ టిల్లర్లు	4

ప్రాణదానం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం


దాత తరపున అదనపు ఈవోకు చెక్కు అందజేస్తున్న రాఘవేంద్ర

తిరుమల, జూన్18(ఆంధ్రజ్యోతి): టీటీడీ ప్రాణదానం ట్రస్టుకు బుధవారం రూ.10 లక్షలు విరాళంగా అందాయి. హైదరాబాద్‌కు చెందిన అనిధృత్ అనే భక్తుడు ఈ విరాళాన్ని ఇచ్చారు. ఈమేరకు దాత తరపున ఆయన ప్రతినిధి రాఘవేంద్ర తిరుమలలో అదనపు ఈవో వెంకయ్య చౌదరికి విరాళం చెక్‌ను అందజేశారు.

తిరుపతి జిల్లాలో ముగ్గురిపై ఎలుగుబంట్ల దాడి

● ఒకరికి తీవ్రగాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అంకయ్య

వెంకటగిరి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా వెంకటగిరి మండలం పాలెంకోట సమీపంలోని వెలుగొండ అటవీ ప్రాంతంలో బుధవారం ముగ్గురిపై రెండు ఎలుగుబంట్లు దాడి చేశాయి. ఈ ఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. బాధితులు తెలిపిన ప్రకారం.. పాలెంకోటకు చెందిన కటారి అంకయ్య, కావడి మునెయ్య, వెంకటగిరి చెందిన మరొకరు వెదురు కర్రల కోసం వెలుగొండ అడవిలోకి వెళ్లారు. ఈ క్రమంలో రెండు ఎలుగుబంట్లు వీరిపై దాడి చేయడంతో కటారి అంకయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వీళ్లతో పాటు వెళ్లిన కుక్క ఎలుగుబంట్లపై తిరగబడటంతో అవి వెళ్లిపోయాయి. వీరితో పాటు వెళ్లిన మరో వ్యక్తి ఎవరన్నది తెలియలేదు. కాగా, మునెయ్యను అటవీశాఖ అధికారులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది.

సినీ ఫక్కీలో కత్తిపోట్లు యువకుడి పరిస్థితి విషమం

కోట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నెల్లూరుపల్లి బీసీ కాలనీకి చెందిన శ్రీహరిపై అదే ప్రాంతానికి చెందిన సూర్య సినీ ఫక్కీలో కత్తితో పొడిచి పరారైనట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. శ్రీహరి, సూర్య మధ్య పాత కక్షలున్నాయి. బుధవారం శ్రీహరి తన ఇంటి సమీపంలో వీధిలో నిలబడి ఉండగా స్కూటీపై వచ్చిన సూర్య కత్తితో పొడిచి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన శ్రీహరిని కుటుంబ సభ్యులు నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

● క్లిష్ట నేరాలను గుర్తించడం.. అదుపు చేయడంలో

తిరుపతి పోలీసులు భేష్

● సీసీ కెమెరాలుంటే నేరస్థుల్లో భయం ● 123 సీసీ కెమెరాల ప్రారంభోత్సవంలో కలెక్టర్

తిరుపతి(నేరవిభాగం), జూన్ 18 (ఆంధ్రజ్యోతి): 'తిరుపతి జనాభా దాదాపు 4.5 లక్షలు. రోజూ మరో 1.5 లక్షల మంది తిరుమలకు వచ్చి వెళుతుంటారు. ఇలాంటి చోట నేరాలు చేయడం చాలా సులభం. అదే సమయంలో నేరాల నియంత్రణ.. నేరాలు జరగకుండా చూడడం పోలీసులకు సవాల్ వంటిది. ఈ విషయంలో పోలీసుల పనితీరు అభినందనీయం' అని కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా పోలీసు శాఖ, ఫ్రీడం ఆయిల్ కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతి నగరం జీవకోనలో ఏర్పాటు చేసిన 123 సీసీ కెమెరాలను బుధవారం ఓ హోటల్‌లో కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. నగరంలోనే అత్యంత సమస్యాత్మక ప్రాంతంలో ఏక కాలంలో 123 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. దీంతో ఇక్కడ నేరాలు చేయాలన్నా ఒకటికి రెండు సార్లు ఆలోచించి భయపడే పరిస్థితిని పోలీసు శాఖ తీసుకొచ్చిందన్నారు. ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా రియల్ టైం పోలీసు వ్యవస్థతో నేరాల దర్యాప్తుతో పాటు నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఇప్పటికే ఎస్పీ హర్షవర్ధన రాజు విజ్ఞప్తితో డ్రోన్ల కొనుగోలు, సోలార్ సీసీ కెమెరాల ఏర్పాటుకు దాదాపు రూ.30 లక్షలు విడుదల చేసినట్లు గుర్తుచేశారు. ఇంకా అవసరమైతే తామిద్దరం టీమ్ వర్కు చేసి తిరుపతిలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాలను అదుపు చేయడం, ప్రజలకు అవసరమైన పోలీసు సేవలు అందించడంలో ముందుంటామని భరోసా ఇచ్చారు. జిల్లా అంతటా సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరిస్తామన్నారు. 'జీవకోనలో 40 లొకేషన్లు, అన్ని దారులు, ప్రధాన కూడళ్లలో ఏమి జరిగినా క్షణాల్లో కమాండ్ కంట్రోలు యూనిట్ ద్వారా తెలిసిపోతుంది. వాహనాల రాక పోకలు సాగించే సమయంలో వాహనాల రిజిస్ట్రేషన్ నెంబర్లు సీసీ కెమెరాల్లో నమోదవుతాయి. పోలీసు శాఖకు కలెక్టర్ అందిస్తున్న సహకారం మరవలేనిది' అని ఎస్పీ హర్షవర్ధనరాజు అన్నారు. నాలుగు నెలల్లోనే 123 సీసీ కెమెరాల ఏర్పాటుకు ఫ్రీడం ఆయిల్ జాతీయ స్థాయి సేల్స్ వైస్ ప్రెసిడెంట్, మార్కెటింగ్ మేనేజర్ చంద్రశేఖరరెడ్డి చేసిన కృషి అభినందనీయమన్నారు. తమ కంపెనీ సామాజిక దృక్పథంతో మహిళలకు భద్రత, భరోసా కల్పించే విషయంలో ముందుంటుందని చంద్రశేఖర రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు అయ్యప్ప, అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి, డీఎస్పీలు భక్తవత్సలం, శ్యాంసుందర్, రామకృష్ణమాచ్చారి, సీఐలు, ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు. అనంతరం జీవకోనలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును ఎస్పీ పరిశీలించారు.


సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న కలెక్టర్

సదరన్ డిస్కంలో 15 మందికి కారుణ్య నియామకాలు


నియామక పత్రాలు ఇచ్చిన సీఎండీ కె.సంతోషరావు

తిరుపతి(ఆటోనగర్),జూన్18(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కంలో కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాల సమస్యను బుధవారం సంస్థ సీఎండీ కె.సంతోషరావు పరిష్కరించారు. అర్హులైన 15 మందికి నియామక పత్రాలను అందించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు గురుతర బాధ్యతతో విధులు నిర్వహించాలన్నారు. సంస్థ ఆర్థికాభివృద్ధితో పాటు ప్రాణాలను కూడా కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కె.గురవయ్య, పి.అయూబ్ ఖాన్, సీజీఎం హెచ్‌ఆర్‌డీ జె.రమణాదేవి, జీఎం వై.వెంకటరాజు పాల్గొన్నారు.


యోగా ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ, కమిషనర్, ఇతర అధికారులు

21న తారకరామ స్టేడియంలో

10వేల మందితో యోగా

తిరుపతి(కలెక్టరేట్/క్రీడలు), జూన్ 18(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 21న తిరుపతిలోని తారకరామ స్టేడియంలో 10వేల మందితో యోగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. ఎస్పీ హర్షవర్ధనరాజు, జేసీ శుభం బన్సల్‌తో కలిసి జిల్లా అధికారులతో కలెక్టరేట్ నుంచి బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. యూనివర్సిటీలు, కళాశాలలు, పాఠశాలల నుంచి విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరయ్యేలా చూడాలని ఆయా శాఖల వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక కమిషనర్ మౌర్య, డీఆర్వో నరసింహులు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. కాగా, బుధవారం సాయంత్రం కమిషనర్ మౌర్యతో కలసి జేసీ శుభం బన్సల్ తారకరామ మైదానంలో పర్యటించారు. ముందురోజే ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆర్డీవో రామ్మోహన్ రావు, పర్యాటక శాఖ ఆర్డీ రమణప్రసాద్ పాల్గొన్నారు.

మామిడి పంట సేకరణపై రైతులకు సమాచారం ఇస్తున్నాం

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 18(ఆంధ్రజ్యోతి): మామిడిపంట సేకరణకు సంబంధించిన సరైన సమయంలో రైతులకు సమాచారం అందజేస్తున్నట్లు సీఎం చంద్రబాబు దృష్టికి కలెక్టర్ వెంకటేశ్వర్ తీసుకెళ్లారు. రాష్ట్ర సచివాలయం నుంచి బుధవారం వర్చువల్ విధానంలో సీఎం చంద్రబాబునాయుడు పొగాకు, మామిడిపండ్లకు సంబంధించి జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. జిల్లా నుంచి కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ జిల్లాలోఈ-క్రాప్ డేటా మేరకు 20,500మంది మామిడిపంటలను సాగు చేసిన రైతులు ఉన్నారని అందులో ఏడాదికి 1.45 మెట్రిక్ టన్నులు కాయలు దిగుబడి అవుతోందన్నారు. జిల్లాలో 8 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్నాయని ప్రస్తుతం 15వేల టన్నులు సేకరించామని తెలిపారు. వారం క్రితం కంగారుపడి ముందస్తుగానే పంటను కోతలు కోసేవారిని అయితే అందరికి సబ్సిడీ వర్తిస్తుందని చెప్పడంతో పంట దిగుబడి వచ్చిన తరువాత తెస్తున్నారన్నారు. మామిడి గుజ్జు పరిశ్రమల వద్ద టోకెన్ సిస్టమ్ ఏర్పాటు చేశామని ఇక్కడ అక్కడ అధికారులను పర్యవేక్షణకు నియమించామన్నారు. ప్రతిరోజు సాయంత్రం ప్రాసెసింగ్ యూనిట్ వద్ద ఎంత సరుకు నిల్వ ఉంది ఎంత సేకరిస్తున్నారనే విషయం చెబుతున్నామన్నారు. రైతు వద్ద చివరి మామిడికాయ వరకు సేకరిస్తామని కలెక్టర్ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, జిల్లా ఉద్యానశాఖ అధికారి దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిల్లల భవిష్యత్తే నా లక్ష్యం

● విడుదలై వెళ్తున్న సురేష్‌బాబు



పెనుకొండ టౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి) : 17ఏళ్లకుపైగా జైలు జీవితాన్ని అనుభవించాను. ఇక నుంచి నా కుమారుడు, కుమార్తె భవిష్యత్తే నా లక్ష్యమని విడుదలపై వెళ్తున్న సురేష్‌బాబు అన్నారు. బుధవారం 14ఏళ్లు జైలు శిక్ష అనుభవిస్తున్నవారిని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 17మంది అర్హులను విడుదల చేశారు. ఈ క్రమంలో పెనుకొండ సబ్‌జైలులో శిక్ష అనుభవిస్తున్న సురేష్‌బాబుకు విముక్తి కలిగింది. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ తాను తమిళనాడు చెన్నైలో ఉండేవాడినని వివాహ అనంతరం తిరుపతిలో ఓ మెడికల్ షాపులో పనిచేస్తూ జీవనం సాగించేవాడినని కుటుంబ కలహాలతో భార్య మృతిచెందడం నాపై వరకట్నం కేసు నమోదుకావడం అప్పట్లో 3నెలలు తిరుపతి జైలులో రిమాండులో ఉన్నాను. అనంతరం కోర్టు విచారణ అనంతరం 2006లో 302-498ఏ సెక్షన్ల కింద శిక్ష ఖరారు చేశారు. అనంతరం కడప జైలులో 10ఏళ్లు, తరువాత సత్‌ప్రవర్తన కలిగి ఉండటంతో పెనుకొండ సబ్‌జైలుకు తరలించారు. అక్కడ ఏడున్నర సంవత్సరాలున్నాను. ప్రస్తుతం కుమారుడు, కుమార్తె ఇంటర్ చదువుతున్నారు. ఏదైనా పనిచేసుకుని పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దుకుంటాను. 17మంది విడుదలైన జాబితాలో నా పేరు ఖరారు చేయడం ఆనందంగా ఉంది. ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

జో.. లాలీ.. జో

● అమ్మ పరీక్షకు వెళ్లింది బజ్జో నాన్నా


చిన్నారిని లాలిస్తున్న తండ్రి


బిడ్డకోసం చెట్టుకు ఉయ్యాల కట్టి..

కోట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అమ్మ.. పరీక్షకు వెళ్లింది బజ్జో నాన్న అంటూ చిన్నారులను ఆడిస్తూ కుటుంబీకులు గడిపారు. కోట మండలం విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం డీఎస్సీ పరీక్ష సందర్భంగా ఈ దృశ్యాలు కనిపించాయి. ఉదయం జరిగిన పరీక్షకు 100 మందికి గాను 93 మంది, మధ్యాహ్నం నుంచి జరిగిన పరీక్షకు 97 మంది హాజరయ్యారు. ఈ పరీక్షా కేంద్రానికి నెల్లూరు, తిరుపతి జిల్లాల నుంచి అభ్యర్థులను కేటాయించారు. ఆయా జిల్లాల నుంచి సమయం దొరకదన్న అనుమానంతో ముందుగానే మహిళా అభ్యర్థులు తమ చంటిబిడ్డలను తీసుకుని వచ్చారు. తమ బిడ్డలకు కళాశాల ప్రాంగణంలోని చెట్లకు చీరలను ఉయ్యాలుగా కట్టి తమ తల్లులు, భర్తల పర్యవేక్షణలో ఆడించమని చెప్పి పరీక్షలకు వెళ్లారు. కొంతమంది ఆటోలలో ఉయ్యాలను కట్టి ఆడించగా, మరికొందరు పిల్లలను తమ భర్తలకు అప్పగించారు.

రవాణా శాఖ స్పెషల్ డ్రైవ్

● 15 పాఠశాలల బస్సులపై కేసులు

● తనిఖీలు కొనసాగుతాయన్న డీటీవో మురళీమోహన్


బస్సులను తనిఖీ చేస్తున్న ఎంవీఐ అతికానాజ్

తిరుపతి(జీవకోన), జూన్ 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పాఠశాలలు పునఃప్రారభమైన నేపథ్యంలో రవాణా శాఖ స్కూల్ బస్సులపై స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. జిల్లా రవాణా శాఖ అధికారి మురళీమోహన్ ఆదేశాలతో అధికారులు కరకంబాడీ సర్కిల్, రామానుపల్లి జంక్షన్, రేణిగుంట రోడ్డు, తిరుచానూరు రోడ్డులో నాలుగు బృందాలుగా బుధవారం తనిఖీలు చేశారు. నిబంధనలు పాటించని 15 పాఠశాలల బస్సులపై కేసులు నమోదు చేశారు. ఇందులో పర్మిట్ లేనివి 2, ఫిట్నెస్ సర్టిఫికెట్ లేనివి 4, త్రైమాసిక పన్ను చెల్లించనవి 4, డ్రైవింగ్ లైసెన్స్ లేనిది ఒకటి ఉన్నాయి. వీటికి రూ.2లక్షలు అపరాధ రుసుం విధించారు. అగ్నిమాపక నియంత్రణ పరికరంలేని నాలుగు బస్సులకు జరిమానా విధించి, రసీదులు ఇచ్చారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు వెంకటసుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, అతికానాజ్, మోహన్‌కుమార్, ఆంజనేయప్రసాద్, రమణ నాయక్ పాల్గొన్నారు.

రవాణా శాఖ నిబంధనలు తప్పక పాటించాలి

మోటారు వాహనాల చట్టం 185జి ప్రకారం స్కూలు, కళాశాలల యజమాన్యాలు బస్సుల విషయంలో నిబంధనలు పాటించాలి. విద్యార్థుల భద్రతకు, భవిష్యత్తుకు ఎలాంటి భంగమూ కలగకుండా చూడాలి. ఫిట్నెస్ సర్టిఫికెట్ లేకుండా బస్సులను రోడ్లపై తిప్పరాదు.

- మురళీమోహన్, జిల్లా రవాణాశాఖ అధికారి

అప్పులు తీర్చలేక..

తిరుపతిలో రైతు దంపతుల ఆత్మహత్యాయత్నం

● భర్త మృతి, భార్య పరిస్థితి విషమం

● బాధితులది కడప జిల్లా


నాగేంద్రరెడ్డి (ఫైల్ ఫొటో)

తిరుపతి(నేరవిభాగం), జూన్ 18(ఆంధ్రజ్యోతి): వ్యవసాయం కోసం చేసిన అప్పులు తీర్చలేక రైతు దంపతులు ఆత్మహత్యకు యత్నించారు. కడపజిల్లాకు చెందిన వీరు ఈనెల 10న తిరుపతిలోని ఓ లాడ్జిలో పురుగుల మందు తాగగా, ఆస్పత్రిలో చేర్పించారు. బుధవారం భర్త నాగేంద్రరెడ్డి (35) మృతిచెందగా.. ప్రాణాపాయ స్థితిలో పుష్పవేణి చికిత్స పొందుతున్నారు.దీనికి సంబంధించి ఈస్ట్ సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. కడప జిల్లా సిద్దవటం మండలం దేగనావాండ్లపల్లెకు చెందిన నిమ్మకాయల నాగేంద్ర రెడ్డికి కొంత పొలం ఉంది. వీరికి 8, 6 ఏళ్ల వయసున్న ఇద్దరు కుమార్తెలున్నారు.పంటల సాగుకు లక్షలాది రూపాయలు అప్పులు చేశారు. ఈసారైనా పంట చేతికి రాక పోతుందా? అప్పు తీర్చకపోతామా అన్న భావనతో అధిక వడ్డీలకు అప్పు చేశారు. కానీ, దురదృష్టం వెన్నాడి పెట్టిన పెట్టుబడి కూడా చేతికి రాలేదు. మరోవైపు వడ్డీలతో కలుపుకొని అప్పులు పెరిగిపోయాయి.వీటిని ఎలా తీర్చాలో తెలియక సతమతమయ్యారు. ఈ క్రమంలో భార్యాభర్తలిద్దరూ కలిసి చనిపోవాలని భావించారు. ఇద్దరు కుమార్తెలను ఇంటి వద్ద వదిలి.. తాము తిరుమలకు వెళ్తొస్తామని చెప్పారు. ఈ నెల 9వ తేదీన తిరుపతికి వచ్చిన భార్యాభర్తలు పెద్దకాపులేఅవుట్‌లోని ఓ లాడ్జిలో గది తీసుకున్నారు. ఆ రోజు నవ్వుతూ కలసి మెలసి తిరిగారు. మరుసటి రోజు గదిలోనే పురుగుల మందు తీసుకుని ఆత్మహత్యకు యత్నించారు.ఈ విషయం తెలిసిన వెంటనే ఈస్ట్ పోలీసులకు లాడ్జి మేనేజర్ సమాచారమిచ్చారు.చికిత్స నిమిత్తం వీరిని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పోలీసులు చేర్పించారు. ఇక్కడ చికిత్స పొందుతూ నాగేంద్ర రెడ్డి బుధవారం మృతి చెందారు. పుష్పవేణి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయా స్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి మునిరెడ్డి ఫిర్యాదు మేరకు ఈస్ట్ సీఐ కేసు నమోదు చేశారు.భార్యాభర్తలు విషం తీసుకోవడం వెనుక ఉన్న బలమైన కారణాలు, ఎవరెవరి వద్ద అప్పులు చేశారు? ఎందుకు చేశారు? డబ్బు కోసం ఎవరైనా వేధింపులకు గురి చేశారా అనే కోణాల్లో విచారిస్తున్నామని సీఐ చెప్పారు.

మొరాయిస్తున్న యోగాసనాల యాప్



తిరుపతి అర్బన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి):ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో పిల్లలతో ఉదయం మూడు ఆసనాలు చేయించాలని ఆదేశించింది. వాటిని ఫొటోలు తీసి పొందుపరచడానికి ప్రత్యేక యాప్ రూపొందించింది. అయితే ఈ యాప్ మొరాయిస్తుండడంతో గంటల తరబడి పిల్లలు, ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలోనే గడపాల్సి వస్తోంది. జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి యాప్‌లో సాంకేతిక లోపాన్ని పరిష్కరించాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

టీడీపీ మండల అధ్యక్షుడిగా కిషోర్ నాయుడు



టీడీపీ మండల అధ్యక్షులు గణపర్తి కిషోర్ నాయుడు, కమిటీ సభ్యులతో నియోజకవర్గ పరిశీలికులు శివకోటారెడ్డి, జమీర్ బాషా

చిట్టమూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): చిట్టమూరు మండల టీడీపీ అధ్యక్షుడుగా గణపర్తి కిషోర్ నాయుడు మూడోసారి ఏకగ్రీంగా ఎన్నికయ్యారని నియోజకవర్గ పరిశీలకుడు ఈశ్వరవాక శివకోటారెడ్డి తెలిపారు. బుధవారం చిట్టమూరు టీడీపీ కార్యాలయంలో పార్టీ సంస్థాగత ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడు, ఉపాధ్యక్షుడుగా రామిశెట్టి హరనాథ్, ప్రధాన కార్యదర్శులుగా గుంపర్ల చిన్నారావు, కేతిరెడ్డి మోహన్‌రెడ్డి, కార్యనిర్వహణ కార్యదర్శులుగా ఆరూరు గిరి నాయుడు, పల్లం సునీత, మండల కార్యదర్శులుగా కే.శ్రీనివాసులురెడ్డి, అంబటి సునీత, మాలపాటి అభిషేక్, కోశాధికారిగా సన్నారెడ్డి మనోజ్ రెడ్డిలను ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడుగా రషీద్ బాషా, తెలుగు రైతు అధ్యక్షుడుగా దువ్వూరు సుధాకర్ రెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడుగా దువ్వూరు సాయిమౌళి, తెలుగు మహిళ అధ్యక్షురాలుగా ఆముతూరు శిరీషా, ఐటీడీపీ మండల అనుబంధ కమిటీ అధ్యక్షుడుగా గణపర్తి భరత్, ఎస్సీసెల్ అధ్యక్షుడుగా కల్లూరు మణి, బీసీ సెల్ అధ్యక్షుడుగా దొడ్డగ వెంకటరమణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు గోపాలరెడ్డి, మస్తాన్‌రెడ్డి, హరికృష్ణారెడ్డి, కామిరెడ్డి సునీల్‌రెడ్డి, దువ్వూరు భారతమ్మ, కస్తూరయ్య, రాజేష్ రెడ్డి, గోపాల్ నాయుడు, బాబు నాయుడు, కంటేపల్లి దేవుడు, ఆరూరు గిరి నాయుడు, చెంచురామయ్య ఆచారి, బషీర్, బాబు, ధనంజయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సంస్థాగత ఎన్నికలకు అభిప్రాయసేకరణ

కోట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కోటలోని షాదీమంజిల్‌లో బుధవారం టీడీపీ సంస్థాగత ఎన్నికలపై అభిప్రాయసేకరణ జరిగింది. గూడూరు నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు ఈశ్వరవాక శివకోటేశ్వరరెడ్డి, కోట మండల పరిశీలకుడు వల్లూరు రమేష్ నాయుడు ఆధ్వర్యంలో అభిప్రాయసేకరణ, సంస్థాగత ఎన్నికలు జరిగాయి. మాజీ జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, బూత్ కన్వీనర్లు క్లస్టర్ ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌చార్జిలు తమ అభిప్రాయాలను పార్టీ పరిశీలకులకు వెల్లడించారు. పార్టీ మండల అధ్యక్ష పదవికి మద్దాలి సర్వోత్తమరెడ్డి, షేక్ జలీల్ అహ్మద్, తీగల సురేష్‌బాబు, పాదర్తి కోటేశ్వర్‌రెడ్డి పోటీ పడుతున్నారు. పార్టీ శ్రేణుల అభిప్రాయాలను అధిష్టానానికి పంపి మండల టీడీపీ అధ్యక్షుడిని ప్రకటిస్తామని పరిశీలకులు కోటేశ్వర రెడ్డి, రమేష్‌నాయుడు తెలిపారు.

విద్యార్థుల కోసం ఆటో ఏర్పాటు



ఆటోలో పాఠశాలకు వెళుతున్న విద్యార్థులతో డీవైఈఓ సనత్‌కుమార్

చిల్లకూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): స్థానిక డానియల్ చిల్డ్రన్స్ హోంలోని విద్యార్థులు చిల్లకూరు ప్రధాన ప్రాథమిక పాఠశాలకు వచ్చి వెళ్లేందుకు ఉపాధ్యాయుల సహకారంతో ఆటో ఏర్పాటు చేయడం జరిగిందని డిప్యూటీ డీఈవో సనత్ కుమార్ తెలిపారు. బుధవారం డానియల్ చిల్డ్రన్స్ హోం నుంచి పాఠశాలకు ఆటో ఏర్పాటు చేసి విద్యార్థులను తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డానియల్ చిల్డ్రన్స్ హోం ప్రధాన పాఠశాలకు కిలోమీటరు దూరంలో ఉందన్నారు. విద్యార్థులు పాఠశాలకు వచ్చి వెళ్లేందుకు అవస్థలు పడుతుండడంతో ఉపాధ్యాయులు సహకారంతో ఆటో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉపాధ్యాయులకు పలువురు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో రవూఫ్, ఉపాధ్యాయులు సుందర రాధా, హన్నా కుమారి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నాణ్యమైన విద్య అందించడానికి కృషి



విద్యార్థులతో డ్రీమ్ ఇండియా ఫౌండేషన్ అధ్యక్షుడు సురేంద్రరెడ్డి

గూడూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పేదలకు నాణ్యమైన విద్య అందించడమే డ్రీమ్ ఇండియా ఫౌండేషన్ సంస్థ లక్ష్యమని ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక సొసైటీ కాలనీలోని సంస్థ కార్యాలయం వద్ద బుధవారం పదో తరగతిలో ప్రతిభచాటిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుల్లో రాణిస్తున్న పేద విద్యార్థులను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించి ఉచితంగా విద్య అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఇప్పటి వరకు తమ సంస్థ ఆధ్వర్యంలో 136 మంది విద్యార్థులు 10వ తరగతి పూర్తి చేయడం జరిగిందన్నారు.

పర్యావరణ పరిరక్షణపై చైతన్యానికి కృషి



కార్తీక్‌ను సన్మానిస్తున్న బీజేవైఎం నేతలు, శ్రీచైతన్య పాఠశాల సిబ్బంది

గూడూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైనత్యం కల్పించడమే తన ధ్యేయమని సైక్లిస్ట్ కార్తీక్ అన్నారు. కడప నుంచి కన్యాకుమారి వరకు కార్తీక్ చేపట్టిన సైకిల్‌యాత్ర బుధవారం గూడూరుకు చేరుకుంది. స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో బీజేవైఎం నాయకులు, పాఠశాల సిబ్బంది కార్తీక్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణకు చేపట్టాల్సిన చర్యలపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు సైకిల్‌యాత్ర చేపట్టానని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, శ్రీహరిబాబు, హరిబ్రహ్మ, మనోజ్‌కుమార్, సూర్యతేజ తదితరులు పాల్గొన్నారు.

పట్టా భూముల్లో రహదారి నిర్మాణం సరికాదు

పెళ్లకూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శిరసనంబేడు గ్రామంలో తాత్కాలికంగా రహదారి ఏర్పాటు చేసిన తమ పొలాలను వదులుకునే ప్రసక్తే లేదని రైతులు స్పష్టం చేశారు. గ్రామ ప్రధాన వీధుల్లో స్టీల్ పరిశ్రమకు చెందిన భారీ వాహనాలు వెళ్తుండడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకునేవి. దీంతో 15 ఏళ్ల క్రితం గ్రామానికి వెలుపల పట్టా భూముల్లో తాత్కాలిక రహదారి నిర్మించారు. ప్రస్తుతం ఆ భూముల్లో శాశ్వతంగా బీటీ రోడ్డు పనులు చేపట్టడంతో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డితో పాటు రైతులు అడ్డుకున్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో బుధవారం డిప్యూటీ తహసీల్దార్ యువరాజు, మండల సర్వేయర్ పూజిత భూములను పరిశీలించారు.

బాలిక కిడ్నాప్

వాకాడు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేణుగోపాలపురం గ్రామానికి చెందిన బాలిక(17) మంగళవారం రాత్రి నుంచి కనిపించడం లేదని ఆమె తల్లి మహేంద్రమ్మ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పూడిరాయదొరువు పంచాయతీ చినతోట గ్రామానికి చెందిన మహేష్ కిడ్నాప్ చేసి ఎత్తుకెళ్లినట్లు అనుమానం వ్యక్తం చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హుస్సేన్‌బాషా తెలిపారు.

పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు 20నుంచి కౌన్సెలింగ్

గూడూరు అర్బన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు ఈనెల 20నుంచి వచ్చేనెల 1వ తేదీ వరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రవికృష్ణ బుధవారం తెలిపారు.

మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ ధ్యేయం: విజయశ్రీ



మునిరత్నంనగర్‌లో ప్రజాసమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం తదితరులు

నాయుడుపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలను కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేట మునిరత్నం నగర్‌లో బుధవారం ఉదయం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీతో కలసి గుడ్‌మార్నింగ్ నాయుడుపేట కార్యక్రమాన్ని చేపట్టారు. మునిరత్నం నగర్‌లో ప్రతి వీధిలో తిరిగి స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. తక్షణమే పరిష్కరించడానికి చర్యలు చేపట్టేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. కొన్ని వీధుల్లో తాగునీరు సక్రమంగా రావడం లేదని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో బోర్లు వేసి తాగునీరు అందించే ఏర్పాటు చేయాలని కమిషనర్ ఫజులుల్లాను ఆదేశించారు. అలాగే పింఛన్లు, రేషన్ కార్డులు, పక్కాగృహాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దారు రాజేంద్ర, ఎంఈవో మునిరత్నం, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్, బీజేపీ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, పోలేరమ్మ కమిటీ చైర్మన్ నానాబాల సుబ్బారావు, తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు అవధానం సుధీర్, పసల గంగాప్రసాద్, ముత్యాలయ్య, రేవతి, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక, శారీరక రుగ్మతలు దూరం



యోగాసనాలు వేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ తదితరులు

నాయుడుపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రోజూ యోగా సాధన చేయడం వల్ల మానసిక, శారీరక రుగ్మతలు దూరమవుతాయని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేట మాలయకోట ప్రభుత్వ పాఠశాలలో బుధవారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా ద్వారా శరీరంలోని ప్రతి అవయవానికి సంబంధించిన రుగ్మతల నివారణతో పాటు దీర్ఘకాలిక వ్యాధులను నియంత్రించవచ్చన్నారు. అనంతరం మెప్మా ఆర్పీలకు ట్యాబ్‌లను ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా, తహసీల్దారు రాజేంద్ర, ఎంఈవో మునిరత్నం, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్, బీజేపీ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు అవధానం సుధీర్, పోలేరమ్మ కమిటీ చైర్మన్ నానాబాల సుబ్బారావు, పసల గంగాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భారత్ వికసిస్తోంది



సమావేశంలో మాట్లాడుతున్న ఎద్దల నరేంద్రరెడ్డి

పెళ్లకూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ 11 ఏళ్ల పాలనలో భారతదేశం అన్ని రంగాల్లో వికసిస్తోందని బీజేపీ మండల అధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పాలచ్చూరు గ్రామంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు కలిచేటి నరసింహులు ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప సభ నిర్వహించారు. గ్రామంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్, బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు గోగుతోటి మురళి, రమణ, భరత్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సంబరాలు

ఓజిలి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ 11 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఓజిలి మండల బీజేపీ శ్రేణులు బుధవారం సంబరాలు చేసుకున్నాయి. బీజేపీ మండల అధ్యక్షుడు పవన్‌కుమార్ అధ్వర్యంలో నాయకులు రవీంద్రరాజు, శ్రీధర్‌రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాంగోపాల్ సేవలు స్ఫూర్తిదాయకం



రాంగోపాల్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ కరుణకుమారి, సిబ్బంది

బాలాయపల్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగమాంబపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ రాంగోపాల్ సేవలు స్ఫూర్తిదాయకమని ప్రస్తుత ప్రిన్సిపాల్ కరుణకుమారి అన్నారు. ఇక్కడ పనిచేసి బదీలి అయిన రాంగోపాల్‌ను బుధవారం సనానించారు. కార్యక్రమంలో మునీంద్ర, మల్లీశ్వరి, విజయమ్మ, సుబ్రహ్మణ్యం, శ్రీలక్ష్మి, భార్గవి, ఆదిలక్ష్మి, నవీన్, వెంకటేశ్వర్లు, మునిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో శిక్షణ తరగతులు

కోట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో డిజైన్ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. బెంగళూరుకు చెందిన డైనమిక్ జనరిక్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో మెకానికల్ ఇంజనీరింగ్ నాల్గవ ఏడాది చదువుతున్న విద్యార్థులకు డిజైన్‌పై ఆరు వారాలు పాటు శిక్షణ ఇవ్వవనున్నట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. డైనమిక్ జనరిక్ సొల్యూషన్స్ వ్యవస్థాపకుడు మామిళ్ల నాగార్జున మెకానికల్ ఇంజనీరింగ్‌లో డిజైన్ల ప్రాముఖ్యం గురించి వివరించారు. కార్యక్రమంలో మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ విక్రమ్‌కుమార్, ప్రాంగణ ఎంపికల అధికారి డాక్టర్ కిషందర్, కోఆర్డినేటర్ అశోక్‌కుమార్‌రెడ్డి, అమర్‌దుర్గా తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయురాలు నవమణితో పూర్వ విద్యార్థులు

గూడూరు అర్బన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్ఎంజీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో బుధవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. 1963-68 విద్యా సంవత్సరంలో చదువుకున్న విద్యార్థులంతా ఒకచోట చేరి ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని నాటి తీపిజ్ఞాపకాలను నేమరువేసుకున్నారు. ఉపాధ్యాయురాలు నవమణిని సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ రోహిణి, డాక్టర్ రవి, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్‌కలాం ట్రస్ట్ కార్యాలయం ప్రారంభం

గూడూరు అర్బన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెండో పట్టణంలో ఏపీజే అబ్దుల్‌కలాం చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయాన్ని సౌంత్‌సెంట్రల్ రైల్వే డీఐజీ షాదాబ్‌జేబ్ ఖాన్ బుధవారం ప్రారంభించారు. ముందుగా స్థానిక రైల్వేస్టేషన్‌లో డీఐజీకి ట్రస్ట్ వ్యవస్థాపకుడు తాజుద్దీన్ స్వాగతం పలికి సన్మానించారు. డీఐజీ మాట్లాడుతూ తాజుద్దీన్ అబ్దుల్‌కలాం పేరిట ట్రస్ట్ స్థాపించి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నరేంద్రనాథ్ చౌదరి, సురేంద్రబాబు, ఆరీఫ్, ఫయాజ్, శ్రీనివాసులు, మఖ్బుల్, ధనుష్‌కృష్ణ చౌదరి, ప్రసాద్‌గౌడ్, మనోజ్‌కుమార్, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎం బాధ్యతల స్వీకరణ

బాలాయపల్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): వెలుగు ఏపీఎంగా వై.కిరణ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న పోలమ్మను వాకాడు మండలానికి బదిలీ కాగా, నెల్లూరు వెలుగు కార్యాలయంలో పనిచేస్తున్న కిరణ్ ఇక్కడకు వచ్చారు.

గ్యాస్ పైప్‌లైన్ మార్గంలో తవ్వకాల నిషేధం

ఓజిలి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం పెద్దపరియ క్రాస్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన ఏజీపీ గ్యాస్ పైప్‌లైన్ మార్గంలో తవ్వకాలను నిషేధించినట్లు నిర్వాహకులు తెలిపారు. పెద్దపరియ క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న గ్యాస్ స్టేషన్ నుంచి నాయుడుపేట, మేనకూరు పారిశ్రామికవాడతో పాటు ఓజిలి మండలం అత్తివరం, గూడూరు ప్రాంతాల్లో గ్యాస్ పైప్‌లైన్ ఉందన్నారు. ఈ మార్గంలో ఏవైనా తవ్వకాలు చేపట్టాలంటే గ్యాస్ కంపెనీ యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు.

పాఠశాల విలీనాన్ని ఆపండి



రావులపాడు పాఠశాలలో నిరసన తెలుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

పెళ్లకూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 3, 4, 5 తరగతులను నెలబల్లి పంచాయతీ భీమవరానికి తరలించడం తగదని రావులపాడు గ్రామస్తులు బుధవారం నిరసన తెలిపారు. తమ ఊర్లో ఉన్న 3, 4, 5 తరగతులను భీమవరంలోని ఎంపీయూపీ పాఠశాలలో విలీనం చేయడం అన్యాయమన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రావులపాడు పాఠశాలకు ఉపాధ్యాయులు లేక అవస్థలు పడ్డామన్నారు. ఇప్పుడు 5 కిలోమీటర్లు దూరంలో ఉన్న భీమవరం గ్రామానికి విద్యార్థులను తరలించడంపై సరికాదని, ప్రభుత్వం పునరాలోచన చేయాలని ఆయన కోరారు.

మండలాభివృద్ధికి కృషి చేయండి

వెంకటగిరి టౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలాభివృద్ధికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఎంపీపీ తంబిరెడ్డి తనూజా రెడ్డి అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యలను త్వరతగతిన పరిష్కరించాలని అధికారులను కోరారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపీడీవో గుణశేఖర్ రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే



చిన్నారులను అభినందిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కోట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కోట మండలం గూడలి పంచాయతీలోని దక్షిణపాలెం, కొండమిట్ట గిరిజనకాలనీ అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. అంగన్‌వాడీ వర్కర్లు చెన్నూరు కోటేశ్వరి, శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో ఐదేళ్ల చిన్నారులకు ప్రోగ్రెస్ కార్డులు ఇచ్చి సమీప ప్రాథమిక పాఠశాలల్లో అడ్మిషన్లు చేయించారు. సూపర్‌వైజర్ కవిత, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

వెంకటగిరి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని బంగారుపేటకు చెందిన సత్తల బాలాజీ(65) తెలుగుగంగ లింకు కాలువలో స్నానానికి వెళ్లి మంగళవారం మృతి చెందాడు. అతని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకొన్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ బుధవారం ఆస్పత్రి వద్దకు చేరుకొని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకొన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు పోలంరెడ్డి కోటేశ్వరెడ్డి, మంకు ఆనంద్ తదితరులు ఉన్నారు.



బాలాజీ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

నేడు పలు రైళ్ల రద్దు

తడ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): చెన్నై - గూడూరు మధ్య నేడు (గురువారం) పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు చెన్నై డివిజన్ సదరన్ రైల్వే అధికారులు ప్రకటించారు. చెన్నై - గూడూరు మార్గంలోని కవర్‌పేట, గుమ్మిడిపూడి స్టేషన్ల మధ్యలో ఇంజనీరింగ్, సిగ్నల్ వ్యవస్థ మార్పు పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 3.00 గంటల వరకు 6 గంటల పాటు పనులను చేపట్టనున్నారు. ఆ సమయంలో ఈ మార్గంలో నడిచే పలు రైళ్లను అధికారులు రద్దు చేశారు.

రద్దయిన రైళ్ల వివరాలు...

- సూళ్లూరుపేట నుంచి నెల్లూరుకు మధ్యాహ్నం 3.50కు బయలుదేరి వెళ్లే మెమూ రైలు నెంబరు 66037
- నెల్లూరు నుంచి సూళ్లూరుపేటకు సాయంత్రం 6.40 నిమిషాలకు బయలుదేరి వచ్చే మెమూ రైలు నెంబరు 66038
- చెన్నై మోర్ మార్కెట్ కాంప్లెక్స్ నుంచి సూళ్లూరుపేటకు ఉదయం 8.35, 10.15 గంటలకు, మధ్యాహ్నం 12.10, 1.05 గంటలకు వచ్చే ఈఎంయూ రైళ్లు.
- సూళ్లూరుపేట నుంచి చెన్నైకు మోర్‌మార్కెట్ కాంప్లెక్స్‌కు ఉదయం 11.45, మధ్యాహ్నం 1.15, 3.10, రాత్రి 9 గంటలకు బయలుదేరి వెళ్లే ఈఎంయూ లోకల్ రైళ్లు.
- చెన్నై నుంచి గుమ్మిడిపూడికి ఉదయం 8.05, 9.00, 9.30, 9.40, 10.30, 11.35, మధ్యాహ్నం 12.40 వచ్చే ఈఎంయూ రైళ్లు.
- గుమ్మిడిపూడి నుంచి చెన్నైకు ఉదయం 9.55, 10.55, 11.25, మధ్యాహ్నం 12.00, 1.00, 2.30, 3.15, బయలుదేరి వెళ్లే ఈఎంయూ లోకల్ రైళ్లు రద్దు అయ్యాయి. అలాగే చెంగల్‌పట్టు, గుమ్మిడిపూడి, తాంబ్రం మధ్య నడిచే పలు రైళ్లను పాక్షికంగా రద్దు చేశారు.

ధరల నియంత్రణలో కేంద్రం విఫలం



సీపీఐ జిల్లా మహాసభల లోగోను ఆవిష్కరిస్తున్న హరినాథ రెడ్డి, సుధాకర్ రెడ్డి, మురళి, రత్నమ్మ తదితరులు

సూళ్లూరుపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వ విఫలమైందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆగస్టులో సూళ్లూరుపేట వేదికగా జరిగే సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నప్పటికీ అవినీతి మితిమీరిపోయిందన్నారు. చంద్రబాబు పాలన ఏడాది పూర్తయినా హామీలను నెరవేర్చలేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, జిల్లా కార్యవర్గ సభ్యుడు పార్థసారధి, సుధాకర్ రెడ్డి, విశ్వనాద్, ఆనంద్, శశికుమార్, రాధాకృష్ణ, నాగేంద్ర, చలపతి, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల్ పాఠశాల ప్రారంభం

ఏర్పేడు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని వికృతమాల వద్ద గురుకుల్ పాఠశాలను బుధవారం ప్రారంభమైంది. మహంత్ తన బృందంతో కలిసి ప్రారంభించారు. స్థానిక టీడీపీ నేత హేమాక్షిరాయల్ పాల్గొన్నారు. గురుకుల్‌లో ఎల్‌కేజీ నుంచి 7వ తరగతి వరకు బాలురకు మాత్రమే ప్రవేశాలు ఉంటాయని పాఠశాల నిర్వాహకులు తెలిపారు. శుక్ స్వామి, ధర్మసాగర్ స్వామి, విసుధ స్వామి, వేద్ స్వామి పాల్గొన్నారు.

పాఠశాల విలీనంపై గ్రామస్తుల నిరసన



ఎంఈవోకి వినతిపత్రం అందిస్తున్న అడవికండ్రిగవాసులు

పిచ్చాటూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవి కండ్రిగ ప్రాథమిక పాఠశాలను అక్కడే కొనసాగించాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆ పాఠశాల కమిటీ చైర్మన్ లక్ష్మి ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో నిరసన తెలిపారు. అనంతరం పిచ్చాటూరు ఎంఈవో కార్యాలయం చేరుకుని కార్యాలయం ఎదుట బైఠాయించారు. పాఠశాలను యథావిధిగా కొనసాగించాలంటూ ఎంఈవో హేమమాలినికి వినతిపత్రం సమర్పించారు. తమగ్రామ ప్రాథమిక పాఠశాలలోని 3,4,5 తరగతులను మూడు కిలోమీటర్ల దూరంలోని రామగిరి పాఠశాలలో విలీనం చేయవద్దని కోరారు.

ఘనంగా గంగ జాతర



పిచ్చాటూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పిచ్చాటూరులో ఆదివారం చాటింపుతో ప్రారంభమైన గంగజాతరలో భాగంగా 4వ రోజు బుధవారం రాత్రి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించి మేళతాళాల నడుమ బాణసంచా పేలుళ్లతో ఊరేగించారు.

వరిలో నల్లి నివారణకు చర్యలు

నాయుడుపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఎడగారు వరిపంటలో నల్లి నివారణకు చర్యలు తీసుకోవాలని నాయుడుపేట ఏడీఏ నాగార్జున సాగర్ అన్నారు. మండలంలోని అన్నమేడు, పుదూరు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. వరిలో నల్లి సోకిన పైరు ఆకులపై తెల్లటి చుక్కలు ఏర్పడుతాయన్నారు. దీని నివారణకు ఓబెరాన్ లేక ఓమిట్ లేక ప్రొఫైనోఫోస్ మందుల్లో ఏదో ఒకటి పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో గణేష్, వీఏఏ చెంగల్‌రాజు, వెటర్నరీ అసిస్టెంట్ మాధవి పాల్గొన్నారు.

చిత్తడిగా మారిన గ్రామీణ రోడ్లు



కోనేటిపాళెం సమీపంలో, చిన్నాయ్యగుంట రోడ్లపై నిలిచి ఉన్న వర్షపు నీరు

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నాయ్యగుంట రోడ్డు వర్షానికి చిత్తడిగా మారింది. జంబుగోళం రోడ్డు - చిన్నాయ్యగుంట మధ్య రెండు కిలోమీటర్ల రోడ్డు ఉంది. ఈ రోడ్డుకు గత వైసీపీ ప్రభుత్వం ఎటువంటి నిర్వహణ పనుల చేపట్టకపోవడంతో అడుగడుగున గుంతలతో ప్రయాణం దుర్భరంగా మారింది. వారం నుంచి కురుస్తున్న చిన్నపాటి వర్షాలతో రోడ్డులో వర్షపు నీరు నిలిచి ఎక్కడ గుంతలున్నాయో తెలియక గ్రామీణులు ఇబ్బంది పడుతున్నారు. అలాగే కోనేటిపాళెం వద్ద కూడా ఇదే పరిస్థితి. సంబంధిత అధికారులు రోడ్లకు మరమ్మతులు చేపటాల్సి ఉంది.

యువత, మహిళల అభివృద్ధికి ప్రాధాన్యం: బీజేపీ

కేవీబీపురం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): దేశంలోని యువత, మహిళల అభివృద్ధికి బీజేపీ ప్రాధాన్యం ఇస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కండ్రిగ బుధవారం చెప్పారు. కేవీబీపురంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు బాబుయాదవ్ ఆధ్వర్యంలో కేంద్రంలో 11 సంవత్సరాలు పాలన పూర్తైన సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ మాట్లాడుతూ... ప్రధాని మోదీ ఇప్పటికే ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని చెప్పారు. మహిళలకు సుకన్య పథకం అందులో ఒకటన్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిశేఖర్‌యాదవ్, వెంకటయ్య, శశియాదవ్, వెంకటముని, దినేష్‌కుమార్, నాగార్జున్, కాటముని తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): దేశంలో సుపరిపాలన మొదలై 11 సంవత్సరాలైందని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చంద్రప్ప అన్నారు. మండల కేంద్రంలో బుధవారం వికసిత్ భారత్, అమృత్ వంటి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. దిలీప్, మునికృష్ణయ్య, పురుషోత్తం, గురుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టుకు హాజరైన టీడీపీ నేతలు



సత్యవేడు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో బనాయించిన కేసులో నియోజకవర్గానికి చెందిన పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు బుధవారం సత్యవేడు కోర్టుకు హాజరయ్యారు. 2023లో నాగలాపురం మండలం సుబ్బానాయుడు కండ్రిగ వద్ద అరుణా నదిలోని ఇసుక రీచ్‌లో అక్రమ తవ్వకాలకు వ్యతిరేకంగా అప్పటి టీడీపీ ఇన్‌చార్జి హెలెన్ ఆధ్వర్యంలో శాంతియుతంగా ధర్నా నిర్వహించారు. నిబంధనలు అతిక్రమించారంటూ అప్పటి వైసీపీ పెద్దల ప్రోద్బలంతో అప్పటి నాగలాపురం ఎస్‌ఐ హనుమంతప్ప నాగలాపురం టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసయాదవ్, ఐ-టీడీపీ కన్వీనర్ సంతోష్‌కుమార్, పార్తిబన్, మండేలా తదితరులు హాజరయ్యారు.

పుత్తూరు వార్తలు

కానరాని పారిశుధ్యం?



దళితవాడలోని మురుగునీటి కాలువల్లో కదలని మురుగు

వడమాలపేట, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ వడమాలపేటలోని దళితవాడలో మురుగు నీటి కాలువలు శుభ్రం చేయక పోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్లపై మురుగు పారుతోంది. దీనికి తోడు దోమలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 40 కుటుంబాలున్న తమ దళితవాడలో మురుగు నీటి కాలువల దుస్థితిపై పలు పర్యాయాలు సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని వాపోతున్నారు. చిన్నపిల్లలు జ్వరాల బారిన పడుతున్నారన్నారు. నాలుగు వీధుల్లో ఇదే పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా పంచాయతీ పారిశుధ్య అధికారులు స్పందించి మురుగునీటి కాలువలు శుభ్రం చేయించాలని దళితవాడవాసులు కోరుతున్నారు.

వైభవంగా కరికాలమ్మ జాతర



పుత్తూరు టౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని తడుకులో కరికాలమ్మ జాతరను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం గ్రామంలోని నడివీధిలో పుట్టమట్టితో అమ్మవారి శిరస్సును ప్రతిష్ఠించి, ప్రాణ ప్రతిష్ఠ చేశారు. అనంతరం శాస్త్రోక్తంగా పూజా కైంకర్యాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద పెద్ద ఎత్తున అంబ ళ్లు పోశారు. అన్నదానం చేశారు. అనంతరం అమ్మవారి ఎదుట కుంభం పోశారు. సాయంత్రం అమ్మవారి చెంపకొట్టి చెరువులో నిమజ్జనం చేయడంతో జాతర ముగిసింది.

లీగల్ మెట్రాలజీ అధికారుల తనిఖీలు



తోపుడుబండిపై కాటాను పరిశీలిస్తున్న అధికారులు

పుత్తూరు అర్బన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో లీగల్ మెట్రాలజీ అధికారులు దాడులు నిర్వహించారు. బుధవారం ఆ శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ సిబ్బందితో కలిసి 50కి పైగా దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. వివిధ వ్యాపారులు వినియోగిస్తున్న కాటాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కాటాల వినియోగంలో పలువురు వ్యాపారులు అక్రమాలకు పాల్పడుతున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో తనఖీలు చేపట్టినట్టు ఆయన తెలిపారు. ఈ దాడులు శనివారం వరకు కొనసాగుతాయన్నారు. ప్రతి ఒక్కరు ఎలక్ట్రానిక్ కాటాలను వినియోగించాలని సూచించారు. ఈ తనిఖీల్లో సహాయకులు గజేంద్రనాయుడు, గణేష్‌పాత్రో, రమేష్‌బాబు, మురళి పాల్గొన్నారు.

దివ్యాంగ పిల్లలను ప్రోత్సహించాలి



రికార్డుల తనిఖీలో సహిత విద్యా సమన్వయకర్త

వడమాలపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ పిల్లలను ప్రోత్సహిస్తూ ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని జిల్లా సహిత విద్యా సమన్వయకర్త చంద్రశేఖర్ రెడ్డి చెప్పారు. బుధవారం వడమాలపేట భవిత కేంద్రంలో శిక్షణ, బోధన పద్ధతులను పరిశీలించారు. పిల్లల హాజరు, పలు రికార్డులను తనఖీ చేశారు. ప్రత్యేక ప్రతిభావంతులు, దివ్యాంగులు భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోనేలా తల్లిదండ్రులను ప్రోత్సహించాలని సిబ్బందిని దిశానిర్దేశం చేశారు. ప్రతి మంగళవారం ఫిజియోథెరపీ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. దివ్యాంగులు, ప్రత్యేక ప్రతిభావంతులకు వ్యాయామం చేయిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో భవిత కేంద్రం టీచర్లు హేమలత, విజయకుమారి పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి సత్యవేడు

రేపు ముక్కంటి హుండీ లెక్కింపు

శ్రీకాళహస్తి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయాన్ని ఈనెల 20న శుక్రవారం లెక్కించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. కొట్టు మండపం వద్ద ఉదయం 7గంటల నుంచి హుండీ లెక్కింపు ప్రారంభం అవుతుందని తెలిపారు. ఆలయ అధికారులు, సిబ్బంది, ఉద్యోగులు తప్పక హాజరు కావాలన్నారు.

వైభవంగా ధర్మరాజస్వామి ఉత్సవాలు

● వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ఈవో తదితరులు

శ్రీకాళహస్తి, జూన్18(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా చెన్నై రోడ్డులో కొలువై ఉన్న ద్రౌపది సమేత ధర్మరాజ స్వామి ఆలయ ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే సుధీర్ తెలిపారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం ఉత్సవాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27వ తేదీ నుంచి ఉత్సవాలుల ప్రారంభమవుతా యన్నారు. కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల వివరాలు...

ధర్మరాజస్వామి ఉత్సవాల్లో ఈనెల 27న పాండవ, కౌరవ జననం కథ, ధ్వజా రోహణం, 28న పాండవ విద్యాభ్యాసం, 29న హిండింబాసుర, బకాసుర వధ, 30న మత్స్య యంత్రచ్ఛేదనం, జూలై 1న ద్రౌపది కల్యాణం, 2న రాజ సూయ యాగం, 3న ద్రౌపది వస్త్రాపహరణం, 4న అర్జున తపస్సు, అలుగు నిలుపుట, 5న ఉత్తర గోగ్రహణం, అర్జునుడు ఆవులను మలవేయుట, 6న దుర్యోధన, దుశ్శాసన వధ, అమ్మవారి కురులు ముడి వేయుట, పూర్ణాహుతి, అగ్నిగుండ ప్రవేశం, 7న వసంతోత్సవం, ధ్వజావరోహణం, 8న కుంభం, 9న పార్వేట ఉత్సవం జరగనున్నాయి.

మోకాళ్లు, కీళ్ల నొప్పుల వైద్య శిబిరం

శ్రీకాళహస్తి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని పెన్షనర్ల భవనంలో బుధవారం మోకాళ్లు, కీళ్ల నొప్పులు, అరుగదలపై అవగాహన సదస్సు, వైద్య శిబిరం జరిగింది. తిరుపతికి చెందిన శ్రీచక్ర ఆస్పత్రి వైద్యుడు, మోకాలు మార్పిడి స్పెషలిస్టు రాజేష్ పాల్గొని పరీక్షలు నిర్వహించారు. మొకాళ్ల నొప్పులు రావడానికి కారణం, నివారణ చర్యలను వివరించారు. వెంకయ్య, భక్తవత్సలయ్య, ప్రసాద్, సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించండి

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వరిలో ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని ఏవో షణ్ముగం సూచించారు. మండలంలోని పల్లమాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా డ్రం సీడర్ పద్ధతిలో వరి నాట్లు వేసిన పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. అన్నదాత సుఖీభవకు సంబంధించి ఈకేవైసీ పెండింగ్ ఉన్న రైతులు తప్పని సరిగా చేసుకోవాలని ఏఈవో రేవతి చెప్పారు.

బయట గ్రామాలకు మా పిల్లలను పంపం

కేవీబీపురం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని గురుకులకండ్రిగ, పాతపాళెం, జ్ఞానమ్మకండ్రిగ, అనంత పద్మనాభపురం, పీవీపురం గ్రామాల ప్రాథమిక పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు బుధవారం ఆయా పాఠశాలలకు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. గురుకులకండ్రిగలో మూడు రోజులుగా పాఠశాలకు తాళం వేసి నిరసన తెలియ జేస్తున్నారు. బుధవారం ఎంఈవో లక్ష్మీపతికి మరోసారి వినతిపత్రాన్ని అందజేశారు. కలెక్టర్, డీఈవో దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటానని ఎంఈవో చెప్పారు.

నారాయణవనం (ఆంధ్రజ్యోతి): తమ ఊరిలో ఉన్న బడిలోనే తమ పిలలను చదివిస్తామని మండలంలోని గోవిందప్ప నాయుడు కండ్రిగ, ఎస్ఎన్ కండ్రిగ దళితవాడవాసులు చెప్పారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రస్తుతం పాఠశాల ఉన్నత పాఠశాలలుగా పునర్వవస్థీకరించడానికి అన్ని అర్హతలు ఉన్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. అనంతరం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు వీడ్కోలు

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులకు పాఠశాల హెచ్ఎం వాణి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, సురేష్‌బాబు, మాదవీలత, మురళీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సోలార్ పరికరాల వితరణ

వరదయ్యపాళెం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాంబాకం పంచాయతీ గ్రామదేవత మాచేలమ్మ ఆలయానికి టీడీపీ మండల అధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి రూ.60 వేల విలువైన సోలార్ విద్యుత్ పరికరాలను అందజేశారు. బుధవారం వాటిని ఆలయంలో అమర్చారు. కాంబాకం మాజీ సర్పంచ్ జయచంద్రారెడ్డి, సురేష్‌రెడ్డి తదితరుల పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా

నారాయణవనం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ప్రజలకు, ప్రజా సమస్యలను పరిష్కారించే దిశగా అందుబాటులో ఉంటానని ఎంపీడీవో అరుణ తెలిపారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. గతంలో ఇక్కడ కార్యాలయ ఏవోగా పనిచేసినా గుణశేఖర్ నాగలాపురంకు బదిలీ కావడంతో, ప్రభుత్వం అరుణను ఎంపీడీవోగా నియమించారు. ఈ మేరకు బాధ్యతలు స్వీకరించిన ఆమె మండల అభివృద్ధి, మౌలిక సౌకర్యాలు, పారిశుధ్యం తదితర ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానని చెప్పారు.

ముక్కంటి సేవలో తెలంగాణమంత్రి

శ్రీకాళహస్తి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని బుధవారం తెలంగాణ మంత్రి అట్లూరి లక్ష్మణకుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్లజ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

యాంత్రీకరణతో ఖర్చు ఆదా



డ్రోన్‌ను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే సుధీర్

శ్రీకాళహస్తి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో యంత్రాలను ఉపయోగించడం వల్ల ఖర్చు ఆదా అవుతుందని ఎమ్మెల్యే సుధీర్ చెప్పారు. తొట్టంబేడులో బుధవారం ఐదు రైతు సంఘాలకు ఐదు డ్రోన్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన డ్రోన్‌ను ఎగువ వేసి పనితీరును పరిశీలించారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం 80 శాతం రాయితీతో డ్రోన్లను అందిస్తోందన్నారు. బొజ్జల బృందమ్మ, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, వ్యవసాయాధికారులు, టీడీపీ మండల అధ్యక్షుడు మునిరాజా నాయుడు, రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు, టీడీపీ నాయకులు గాలి మురళి నాయుడు, జయచంద్రనాయుడు, వెంకటాచలం, ప్రతాప్‌రెడ్డి, రమేష్, రామానాయుడు, శంకర్‌నాయుడు,చంద్రారెడ్డి, భాస్కర్ నాయుడు, వాసునాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే ఆదిమూలం



సీఎంకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే

సత్యవేడు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబును ఎమ్మెల్యే ఆదిమూలం బుధవారం అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు నియోజకవర్గ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. అనంతరం సీఎంవోకు చేరుకుని సీఎం సహాయ నిధి చెక్కులను అధికారుల నుంచి స్వీకరించారు. తన సిఫార్సు మేరకు నియోజకవర్గంలో 13 మందికి సీఎం ఆర్ఎఫ్ చెక్కులను అందించినందుకు సీఎంకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆర్అండ్‌బీ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండేను కలిసి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు.

పాపానాయుడుపేటలో ఆడియో క్లిప్పుల కలకలం

ఏర్పేడు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపానాయుడుపేట వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ కమిటీ సభ్యుడొకరు బుధవారం వాట్సప్ గ్రూప్‌లో పెట్టిన మూడు ఆడియో క్లిప్స్ కలకలాన్ని రేపాయి. పంచాయతీలోని కొందరు నాయకుల గురించి ఆయన క్లిప్స్‌ను పోస్టు చేశారు. ఇటీవల ఆలయ రాజగోపురం మహాకుంభాభిషేకం పూర్తయ్యింది. ఆలయానికి తాగునీటి వసతి, ప్రహరీ తొలగింపు, బోరు వివాదం, రూ.1.50లక్షల చెల్లింపు సమస్య, చీటి నగదు చెల్లింపు సమస్యలు ఓ ప్రజాప్రతినిధి పరిష్కరించేందుకు హామీ ఇచ్చినప్పటికీ పాపానాయుడు పేటకు చెందిన నాయకులు సహకరించకపోగా నగదు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారంటూ ఆడియో క్లిప్స్ వివాదాన్ని మరింత రేకెత్తించాయి. ఆలయానికి పక్కన కొంత స్థలం ఉందని అందులో ఆలయానికి సంబంధించి నిర్మాణాలు చేస్తుంటే దానికీ లక్షల రూపాయలు ఇవ్వాలంటూ నాయకులు డిమాండ్ చేస్తున్నట్లు ఆడియోలో ఉన్నాయి. నియోజకవర్గంలో పార్టీ నాయకులు ఈ వివాదాన్ని ఎలా సద్దుమణిగేలా చూస్తారో వేచి చూడాల్సిందే మరి.

హ్యావెల్స్ పరిశ్రమలో రక్తదానం



రక్తదానంలో పాల్గొన్న హావెల్స్ ఉద్యోగులు

సత్యవేడు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని ఏసీ తయారీ పరిశ్రమ హ్యావెల్స్ లాయిడ్‌లో ప్రపంచ రక్తదాత దినోత్సవం సందర్భంగా బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. నెల్లూరుకు చెందిన రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో పరిశ్రమలోని 128 మంది ఉద్యోగులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేసినట్టు ప్లాంట్ హెడ్ గిరీష్‌చంద్ర తెలిపారు. ఇందులో 44 మంది తొలిసారిగా రక్తదానం చేశారన్నారు. కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు లారెన్స్ ఆరోగ్యరాజ్, అశ్విందర్ రైనా, ప్రవీణ్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత స్థలం పరిశీలన

రేణిగుంట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుబ్బరాజు బోరు స్థలాన్ని శ్రీకాళహస్తి డీఎల్పీవో పద్మజ పరిశీలించారు. పంచాయతీకి చెందిన బోరు జాగా ఆక్రమించుకుని ఇల్లు నిర్మించుకున్నారంటూ కాంగ్రెస్ పార్టీ రేణిగుంట మండల మాజీ అధ్యక్షుడు రావణ డిప్యూటీ సీఎం పవన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై విచారణకు బుధవారం పంచాయతీ కార్యాలయానికి డీఎల్పీవో చేరుకున్నారు. ఫిర్యాదుదారుడు వద్ద ఉన్న ఆధారాలను పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి మాధవితో కలిసి ఆక్రమిత స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుడు రావణ మాట్లాడుతూ... పంచాయతీ ఆస్తులను ఆక్రమించుకుని ఇల్లు నిర్మించుకోవడంపై ఫిర్యాదు చేశానని, ఇప్పటివరకు నలుగురు డీఎల్పీవోలు పరిశీలించారే తప్ప చర్యలు తీసుకోలేదన్నారు.

దేశ గౌరవం నిలిపేలా మోదీ పాలన

సత్యవేడు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): దేశ గౌరవం నిలబెడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలన సాగుతోందని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ చంద్రప్ప పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎన్జీవో భవనంలో పార్టీ మండల అధ్యక్షుడు బాలాజి ఆధ్వర్యంలో బీజేపీ 11 ఏళ్ళ పాలన కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన చంద్రప్ప మాట్లాడుతూ మోదీ పాలనలో దేశం ఆర్థికాభివృద్ధిలో ప్రపంచంలో 4వ స్థానానికి చేరుకుందని తెలిపారు. సేవా, సంక్షేమ కార్యక్రమాలతో దేశంలో ఆత్మనిర్భర్ ప్రతిబింబిస్తోందన్నారు. ప్రపంచ రికార్డు నెలకొల్పుతూ జరగనున్న యోగా దినోత్సవంతో ప్రపంచ దేశాలు భారత్ వైపు చూసేలా మోదీ పాలన సాగిస్తున్నారని కొనియాడారు.

యోగాంధ్రను విజయవంతం చేద్దాం

శ్రీకాళహస్తి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న యోగాంధ్రను విజయవంతం చేద్దామని మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషికి యోగా నిత్య జీవితంలో ఒక భాగం కావాలన్నారు. 21న విశాఖపట్టణంతో పాటు ఆయా ప్రాంతాల్లో జరిగే యోగా శిబిరాల్లో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సత్రవాడ ప్రవీణ్‌కుమార్, నారాయణయాదవ్, భాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీఎంతో టీడీపీ నాయకుల భేటీ



శ్రీకాళహస్తి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబును బుధవారం తిరుపతి పార్లమెంటు తెలుగురైతు ఉపాధ్యక్షుడు ప్రకాష్‌నాయుడు రాష్ట్ర సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతి రైతుల పాదయాత్రకు, లోకేశ్ యువగళం పాదయాత్రకు, నారా భువనేశ్వరి నిజం గెలవాలి కార్యక్రమాలకు తన స్థలాన్ని ఇచ్చి బస కల్పించారు. ఈ నేపథ్యంలో బుధవారం సీఎంకు ప్రొఫైల్ బుక్‌ను అందజేసి సమస్యలను విన్నవించారు. సీఎం సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు.



ఏర్పేడు (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబును అమరావతిలో బుధవారం ఏర్పేడు మండల టీడీపీ సీనియర్ నాయకుడు, మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు రాయపనేని మల్లికార్జుననాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మడిబాక పంచాయతీలో సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం చంద్రబాబుకు గుడిమల్లం ఆలయ తీర్థప్రసాదాలను అందజేశారు.

ఘనంగా అక్షరాభ్యాసం

ఏర్పేడు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంజిమేడు అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం అక్షరాభ్యాసం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ స్వర్ణలత తల్లులను పిలిపించి చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. కేంద్రానికి క్రమం తప్పకుండా పిల్లలను పంపి ప్రభుత్వం అందించే పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని చెప్పారు.